

19వ వసంతంలోకి ...

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఉత్తరాంధ్ర

విశాఖపట్నం, శ్రీకాకుళం

విజయనగరం

శుక్రవారం 26-02-2026 పేజీలు: 20


# కొత్త లేఅవుట్లకు మోకాలడ్డు

- మాస్టర్‌ప్లాన్ పేరుతో కొత్త లేఅవుట్ల ప్లాన్లకు అనుమతులు నిరాకరణ
- బృహత్తర ప్రణాళిక-2041లో మార్పులకు పట్టు
- మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధి పేరుతో లేఅవుట్లకు మెలిక - దరఖాస్తు చేసుకునే వారితో మంతనాలు
- తమ వాటాలు ఇవ్వకుంటే ప్లాన్లు రాకుండా చేస్తామని హెచ్చరికలు
- స్థిరాస్తి వ్యాపారానికి గుదిబండలా నేతల నిర్ణయాలు
- లేఅవుట్లకు అనుమతులు నిరాకరణ?
- మందగమనంలో స్థిరాస్తి రంగం




2లో



# రూ.200 కోట్ల లిక్విడ్ పట్టివేత!

- ★ ఆంధ్రకు అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధం చేస్తున్న హాషీస్ ఆయిల్
- ★ రూ.200 కోట్ల విలువైన హాషీస్ ఆయిల్ స్వాధీనం
- ★ తాత్కాలిక తయారీ యూనిట్ ధ్వంసం..!
- ★ గంజాయి స్మగ్లర్ల పై వరుస దాడులు

2వ పేజీలో

## ఎస్ఈజెడ్‌లో బ్లూ జెట్ ఫార్మా భారీ పెట్టుబడి

- ◆ రూ.2,300 కోట్ల ప్రాజెక్టుకు 28న మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన
- ◆ వేలాదిమందికి ఉపాధి అవకాశాలు
- ◆ మౌలిక వసతుల బలోపేతం




3వ పేజీలో

## 28 నాటికి యు.ఎఫ్.ఎస్. కుటుంబ సర్వే పూర్తి చేయాలి

- తూర్పు జోన్ లో పర్యటించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



2వ పేజీలో

# 200కోట్ల లిక్విడ్ గంజాయి పట్టువేత..!!

★ సత్ఫలితాలిస్తున్న ఆంధ్ర ★ ఒడిస్సా పోలీసుల చర్చలు ★ విశాఖ రేంజ్ ఐజిపి గోపినాథ్ జట్టి ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ★ పాల్గొన్న ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు ★ దూకుడు పెంచిన కోరాపుట్ పోలీసులు ★ ఐజీ గోపి నాథ్ జట్టి వ్యూహం విజయవంతం..! ★ ఆంధ్ర కు తప్పిన గంజాయి ముప్పు..!

(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)

గంజాయి నియంత్రణపై పోలీసులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో ఎక్కడ గంజాయి అనేది కనిపించకుండా ఉండేందుకు ప్రణాళిక బద్ధంగా, ప్రతిష్టాత్మకంగా, దూకుడుగా తీసుకుంటున్న చర్యలు అనూహ్య ఫలితాలు ఇస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ – ఒడిస్సా అంతర్రాష్ట్ర సమన్వయ వీడియో కాన్ఫరెన్స్ లో జరిగిన చర్చలు గంజాయి రవాణా నిర్మూలన పై ప్రభావం చూపించాయి. ఒడిస్సా నుంచి ఆంధ్రప్రదేశ్ కు పెద్ద ఎత్తున హాషీష్ ఆయిల్ ను తరలించేందుకు సిద్ధం చేస్తున్న సమయంలో అక్కడి పోలీసులు ఆకస్మిక దాడులు చేసి హాషీష్ ఆయిల్ ను స్వాధీనం చేసుకున్నారు.కోరాపుట్ పోలీసులు స్వాధీనం చేసుకున్న 1800 లీటర్ల హాషీష్ ఆయిల్ విలువ రూ.200 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

### ★ చర్చల అనంతరం గంజాయి స్మగ్లర్ల పై దూకుడు పెంచిన పోలీసులు..

విశాఖపట్నం రేంజ్ ఐజిపి గోపినాథ్ జట్టి ఆధ్వర్యంలో ఈనెల 24న ఆంధ్రప్రదేశ్ అలాగే ఒడిస్సా రాష్ట్రాల పోలీస్ ఉన్నత అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో గంజాయి అక్రమ సాగు పై చేపట్టిన కఠిన చర్యల పై, జూలై 2024 లో లక్ష్యంగా పెట్టుకున్న జీరో కల్టివేషన్ (సున్నా సాగు) ను



2026 నాటికి విజయవంతంగా సాధించినట్లు చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో కోరా పుట్ డిఐజి డాక్టర్ కన్వర్ విశాల్ సింగ్ తో పాటు రెండు రాష్ట్రాల నుంచి పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర – ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆపరేషన్ సంయుక్త పేరిట ఆ ఆపరేషన్లు నిర్వహించాలని, గంజాయి రవాణా మార్గాలు, నిల్వ కేంద్రాలు,హాషీస్ ఆయిల్ ,లిక్విడ్ గంజాయి క్యారీ యూనిట్లపై నిరంతర ఇంటలిజెన్స్ నిఘా ఉంచడంపై చర్చించిన అనంతరం తీసుకున్న నిర్ణయాలు మేరకు ఒడిస్సా పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తూ గంజాయి మాఫియా పై ఉక్కు పాదం మోపుతున్నారు. ఈ చర్చలు ఫలితంగానే కోరాపుట్ పోలీసులు అంతర్రాష్ట్ర హాషీష్ ఆయిల్ తాత్కాలిక తయారీ యూనిట్‌ను ధ్వంసం చేశారు. అలాగే స్వాధీనం చేసుకున్న 1000 కిలోల గంజాయి రూ.5 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులతో జరిగిన చర్చలు అనంతరం ఒడిస్సా రాష్ట్రం నుంచి గంజాయి అక్రమ రవాణాను నిలువరించేందుకు అక్కడ పోలీసులు దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే అక్కడ అనేక తాత్కాలిక తయారీ యూనిట్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులకు కోరాపుట్ ఎస్పీ ప్రణాళిక చేసి నాయకత్వం వహించారు. ఖచ్చితమైన నిఘా సమాచారం ఆధారంగా విస్తృతంగా దాడులు నిర్వహించారు. అక్కడి పోలీసులు నిర్వహించిన ప్రదేశం జంగిల్ ఏరియా, జోలాపుట్ రిజర్వాయర్ వెంబడి, పిఎస్ పాడువా, ఒడిశా – ఎపి సరిహద్దులో ఉంది. తయారీ యూనిట్ యొక్క ప్రధాన వ్యక్తులను గుర్తించారు. వారిని త్వరలో పట్టుకుంటామని చెబుతున్నారు. హాషీష్ ఆయిల్ తయారీలో అంతర్రాష్ట్ర సంబంధాల పై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### ★ కోరాపుట్ జిల్లాలో మరో దాడి..!

ఇదిలా ఉండగాకోరాపుట్ జిల్లాలో అక్కడ పోలీసులు నిర్వహించిన మరొక ప్రత్యేక దాడిలో, హర్యానాకు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. నంద్పూర్ పిఎస్ పరిధి లో, 1143 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దాని మార్కెట్ విలువ సుమారు రూ. 5 కోట్లు ఉంటుందని సమాచారం. ఒడిస్సా రాష్ట్రంలో గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కు పాదం మోపుతామని అక్కడ పోలీసులు చెబుతున్నారు. తమ రాష్ట్రంలో నుంచి గంజాయి స్మగ్లర్లపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టామని, ఎవరిని వదిలే ప్రసక్తి లేదని పేర్కొంటున్నారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి తమ రాష్ట్రం లోకి ప్రవేశించే గంజాయి లేదా స్మగ్లర్లకు చెక్ పెట్టేందుకు పగడ్బందీగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడిస్తున్నారు.

### ★ గంజాయి రహిత సరిహద్దు ప్రాంతం సాధ్యమే
### ★ విశాఖ రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టి

ఒడిస్సా – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పోలీస్ అధికారుల సమన్వయంతో గంజాయి రహిత సహజ ప్రాంతం సాధ్యమని విశాఖ రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టి తెలిపారు. గంజాయి రవాణా మార్గాలు, నిల్వ కేంద్రాలు,హాషీస్ ఆయిల్,లిక్విడ్ గంజాయి తయారీ యూనిట్ ల పై నిరంతర ఇంటెలిజెన్స్ పంచుకోవడం ఇరు రాష్ట్రాలకు ఉపయోగకరంగా ఉందన్నారు. సరిహద్దు జిల్లాల మధ్య సమన్వయాన్ని వేగవంతం చేయడానికి ప్రతి బోర్డర్ జిల్లాకు లైజన్ అధికారులను నియమించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. నిరంతర అంతర్రాష్ట్ర సమన్వయం, సంయుక్త ఎన్ఫోర్స్మెంట్ ఆపరేషన్లు, ఆర్థిక దర్యాప్తులను బులోపేతం చేయడం ద్వారా దీర్ఘకాలిక, స్థిరమైన ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు.

# కొత్త లేఅవుట్లకు మోకాలడ్డు

**విశాఖపట్నం, ప్రత్యేక ప్రతినిధి, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** అధికార పార్టీ నేతల 'మాస్టర్ ప్లాన్' స్థిరాస్తి రంగం ఆశనిపాతంగా మారుతోంది. బృహత్తర ప్రణాళిక పునః పరిశీలన రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం చేపిస్తోంది. జిల్లాలో భూ క్రయ, విక్రయాల్లో స్తబ్దత కొనసాగుతోంది. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్--2041 సవరణలకు పూనుకోవడం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మరింత శాపంగా పరిణమించేలా కనిపిస్తోంది. ప్రధానంగా బృహత్తర ప్రణాళిక రహదారుల పేరుతో కొత్త అవుట్లకు మోకాలడ్డుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది స్థిరాస్తి వ్యాపారులకు మరింత నష్టాన్ని తెచ్చిపెడుతోంది.

### - లేఅవుట్లకు అనుమతులు నిరాకరణ?

వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక--2041 పునః పరిశీలన పేరుతో కూటమి ప్రభుత్వం మరోసారి అభ్యంతరాలను స్వీకరించింది. ఇప్పటికే ఫిర్యాదుల స్వీకరణతో పాటు వాటి పరిశీలన కూడా పూర్తి చేశారు. వెయ్యికి పైగా వచ్చిన అభ్యంతరాలను ప్రజాప్రతినిధుల సమక్షంలో అధికారులు పరిశీలించారు. ఇది జరిగి ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు మాస్టర్‌ప్లాన్‌పై అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికీ మాస్టర్‌ప్లాన్‌లో చేస్తున్న సవరణలు బయటకు రాకుండా జాగ్రత్తలు పడుతున్నారు. కొంత మంది నేతల భూములు, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి లబ్ధి చేకూరేలా సవరణలు చేసే అవకాశాలు ఉన్నాయని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఒకవైపు తమ భూముల ధరలు పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూనే మరోవైపు ప్రైవేటు లేఅవుట్లకు అనుమతులు రాకుండా అడ్డుపడుతున్నారని పేర్కొంటున్నారు. బృహత్తర ప్రణాళిక రహదారులు వస్తాయన్న నెపంతో కొత్త లేఅవుట్లను అనుమతులు ఇవ్వకుండా హోల్డ్‌లో పెడుతున్నట్లు రియల్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### - మందగమనంలో స్థిరాస్తి రంగం

ప్రస్తుతం జిల్లాలో స్థిరాస్తి రంగం కుదేలైంది. భూముల క్రయ విక్రయాలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రస్తుతమున్న ప్రాజెక్టుల్లోనే ఫ్లాట్లు, వెంచర్లలో ప్లాట్ల అమ్మకాలు పడిపోయాయి. 2024--25 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.1526 కోట్లు లక్ష్యంగా కాగా.. కేవలం 75 శాతం మేర ఆదాయం మాత్రమే సమకూరడమే జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైందనడానికి నిదర్శనం. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2023--24 ఆర్థిక సంవత్సరంలో రూ.వెయ్యి కోట్లు లక్ష్యానికి మించి రూ.1060.03 కోట్లు సమకూరింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్తగా వెంచర్లు, నిర్మాణాలకు ఎవరూ సాహసించడం లేదు. గత ఏడాది కాలంగా కొత్త లేఅవుట్ల అభివద్ధికి ఎవరూ ముందుకు రాకపోవడం జిల్లాలో స్థిరాస్తి రంగ పరిస్థితికి అద్దం పడుతోంది. గతంలో వీఎంఆర్‌డీఏ పరిధిలో పదుల సంఖ్యలో కొత్త లేఅవుట్లకు దరఖాస్తులు వచ్చేవి. కానీ ఇపుడు కేవలం ముగ్గురు, నలుగురు వ్యాపారులు మాత్రమే లేఅవుట్లకు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటికి కూడా బహత్తర ప్రణాళిక పేరుతో అడ్డంకులు సష్టిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. మాస్టర్ ప్లాన్ పూర్తనైంత వరకు కొత్తగా లేఅవుట్లకు అనుమతులు మంజూరు చేయకూడదని కూటమి ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిళ్లు తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బృహత్తర ప్రణాళికను పూర్తి చేసేందుకు మరో మూడు, నాలుగు నెలలు పట్టే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. దీన్ని అడ్డుపెట్టుకుని వారి అనుచరులు రియల్ వ్యాపారులతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. తమ వాటాలు ఇవ్వకుండా లేఅవుట్లకు అనుమతులు వచ్చే అవకాశం లేదని బేరసారాలు చేస్తున్నట్లు వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న స్థిరాస్తి రంగం.. కూటమి నేతల కారణంగా మరింత పతనమయ్యే ప్రమాదముందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

# 28 నాటికి యు.ఎఫ్.ఎస్. కుటుంబ సర్వే పూర్తి చేయాలి

### – తూర్పు జోన్ లో పర్యటించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** యునిఫైడ్ ఫ్యామిలీ సర్వే పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ గురువారం తూర్పు జోన్‌లో పర్యటించి పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రామాలయం, గాంధీనగర్ జంక్షన్, సంజయ్ గాంధీ కాలనీ--01 సచివాలయాల్లో జరుగుతున్న యు.ఎఫ్.ఎస్. కుటుంబ సర్వే పురోగతిని సమీక్షించారు. ఈ తనిఖీల సందర్భంగా పలు అంశాలపై అధికారులకు, సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. కుటుంబ సర్వేను ఫిబ్రవరి 28 నాటికి తప్పనిసరిగా 100 శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు సర్వే ప్రారంభించని సచివాలయ సిబ్బందిపై ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. తూర్పు జోన్ పరిధిలోని కొన్ని పరిమిత ప్రాంతాల్లో ప్రజలు సర్వేకు సహకరించకపోవడంపై జిల్లా కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజల సహకారం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రజలు సచివాలయ సిబ్బందికి పూర్తిగా సహకరించి యునిఫైడ్ ఫ్యామిలీ కుటుంబ సర్వేను శాతం పూర్తయ్యేలా తోడ్పాటు అందించాలని, అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే 48వ వార్డులో ఓట్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించిన ఆయన సంబంధిత విభాగాల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి, ఎన్నికల విభాగం అధికారులు పర్యటనలో పాల్గొన్నారు.

# కమిషనర్ చొరవతో హిట్ అండ్ రన్ బాధితులకు భరోసా

**– రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా రూ.3.50 లక్షల పరిహారం పంపిణీ – సీపీ డా. శంఖబ్రత బాగ్చి సమర్థతకు నిదర్శనం**



**విశాఖ క్రైం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో బాధిత కుటుంబాలకు తక్షణ భరోసా కల్పించాలనే లక్ష్యంతో విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన "రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం" మరోసారి తన ప్రభావాన్ని చాటింది. తాజాగా నాలుగు హిట్ అండ్ రన్ కేసుల్లో ఒక మృతి, ముగ్గురు గాయపడిన బాధితులకు కలిపి రూ.3,50,000 పరిహారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు. భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం పిరియాగ్రహారం గ్రామానికి చెందిన ఎలమంచిలి రాజులు మరణించగా, ఆయన భార్య ఎలమంచిలి రాజేశ్వరికీ రూ.2,00,000 పరిహారం అందజేశారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో గాయపడిన వడ్లపూడి ఆర్.హెచ్. కాలనీకి చెందిన తరణి నారాయణరావుకు రూ.50,000, అదే ప్రాంతానికి చెందిన తరిణి లక్ష్మికి రూ.50,000 పరిహారం జమ చేశారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గాయపడిన విజయనగరం జిల్లా మెంటాడ గ్రామానికి చెందిన తాడి సురేష్‌కు రూ.50,000 అందజేశారు.నగరంలో రోడ్డు ప్రమాదాల్లో మరణించిన,గాయపడిన వారికి ఇప్పటివరకు దాదాపు కోటి రూపాయలకు పైగా సహాయం అందజేశారు. ఇంతవరకు కమిషనరేట్ పరిధిలో జరిగిన హిట్ అండ్ రన్ కేసుల్లో 27 మంది మృతుల కుటుంబాలకు రూ.54 లక్షలు, 102 మంది గాయపడిన వారికి రూ.51 లక్షలు అందజేశారు. మొత్తం 129 మంది బాధితులకు రూ.1,05,00,000 పరిహారం అందించడం ద్వారా పోలీస్ శాఖ మానవతా దృక్పథాన్ని ప్రదర్శించింది. బాధితులకు అండగా ప్రత్యేక కేంద్రం ప్రమాదం జరిగిన వెంటనే బాధిత కుటుంబాలు చట్టపరమైన ప్రక్రియలతో ఇబ్బంది పడకుండా పరిహారం పొందే వరకు సహాయక కేంద్రం పూర్తి మార్గదర్శకత్వం అందిస్తోంది. అవసరమైన పత్రాల సేకరణ నుంచి బ్యాంకు ఖాతాలో నేరుగా నిధుల జమ వరకు అధికారులు చురుకుగా చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి నాయకత్వంలో అమలవుతున్న ఈ విధానం నగర ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తోంది. బాధితుల పట్ల సానుభూతితో, వేగవంతమైన పరిపాలనతో కమిషనరేట్ సేవలందిస్తోందనే భావన వ్యక్తమవుతోంది. హిట్ అండ్ రన్ కేసుల్లో పరిహారం కోసం విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లోని "రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం"ను లేదా టోల్ ఫ్రీ నంబర్ 7995095793 ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## హెల్మెట్ ధారణే ప్రాణరక్షణకు కవచం

**– ట్రాఫిక్ నియమాలపై నగరవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు – సీపీ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్**





**పెద గంట్యాడ, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్న నగర పోలీసులు, ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై చైతన్యం కల్పించేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో ట్రాఫిక్ పోలీసులు పలు కూడళ్ల వద్ద ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా ప్రాణరక్షణకు అత్యవసరమని అధికారులు వివరించారు. ప్రమాదాల సమయంలో తల గాయాలే ఎక్కువ మరణాలకు కారణమవుతున్నాయని, కాబట్టి రెండు చక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగం ఎంతటి ప్రమాదాలకు దారితీస్తుందో ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించారు. ఒక్క క్షణం ఏకాగ్రత కోల్పోయినా ప్రాణాంతక ప్రమాదం సంభవించే అవకాశముందని హెచ్చరించారు. వాహనాలకు కాలుష్య నియంత్రణ ధృవీకరణ పత్రాలు (పీయుసి) సక్రమంగా ఉండాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని తెలియజేశారు. కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన నగర వాతావరణాన్ని నెలకొల్పవచ్చని చెప్పారు. నియమాల పాటింపే భద్రతకు బాట ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా వ్యక్తిగత భద్రతతో పాటు కుటుంబాల భద్రతను కూడా కాపాడవచ్చని అధికారులు పేర్కొన్నారు. నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది ప్రత్యక్షంగా వాహనదారులతో మాట్లాడి సూచనలు అందించారు. ప్రజలు కూడా పోలీసుల చర్యలకు సహకరిస్తూ హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలనే సంకల్పం వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని నగర పోలీసులు తెలిపారు.

## ఎస్ఈజెడ్‌లో బ్లూ జెట్ ఫార్మా భారీ పెట్టుబడి




**అచ్యుతాపురం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్ఈజెడ్) పరిధిలో పారిశ్రామిక విస్తరణకు మరో కీలక ముందడుగు పడింది. రాంబిల్లి మండలం సీతాపాలెం సమీపంలో రూ.2,300 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న 'బ్లూ జెట్' ఫార్మా కంపెనీకి ఈ నెల 28న మంత్రి నారా లోకేష్ భూమిపూజ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంత్రి రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను గోపీనాథ్ జెట్టి, ఎస్పీ అధికారి తుహిన్ సిన్హా పరిశీలించారు. బందోబస్తు నిర్వహణపై సీఐలు, ఎస్సైలకు పలు సూచనలు జారీ చేశారు. అచ్యుతాపురం--రాంబిల్లి పారిశ్రామిక కారిడార్ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నదని అధికారులు పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు పారదర్శక విధానాలు, వేగవంతమైన అనుమతులు, మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. 'బ్లూ జెట్' ఫార్మా యూనిట్ ప్రారంభంతో వేలాదిమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించే అవకాశం ఉందని నిర్వాహకులు వెల్లడించారు. స్థానిక యువతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరిశ్రమ ప్రధానంగా ఔషధ, రసాయన సంబంధిత ఉత్పత్తుల తయారీతో పాటు ఎగుమతులపై దృష్టి సారించనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమయ్యే యూనిట్ ద్వారా విదేశీ మారకద్రవ్యం ఆదాయం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఎస్ఈజెడ్‌లో ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. కొత్త పరిశ్రమల రాకతో మౌలిక వసతులు మరింత బలోపేతం అవుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

## ఘనంగా సామిల్ ఉత్సవ్--2026

**- రామ్ ఆటోమాల్ 15వ వార్షికోత్సవ వేడుకలు**



**ఆనందపురం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** వినియోగించిన వాహనాలు, యంత్రాలు మరియు ఇతర ఆస్తుల వేలం రంగంలో దేశవ్యాప్తంగా అగ్రగామిగా నిలిచిన శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్ (సామిల్) తన 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని "సామిల్ ఉత్సవ్--2026" కార్యక్రమాన్ని ఆనందపురం మండలం దుక్కవానిపాలెం టోల్‌గేట్ సమీపంలోని తర్లువాడలో ఘనంగా నిర్వహించింది. ఫిబ్రవరి 26న దేశవ్యాప్తంగా 135కు పైగా ఆటోమాల్స్‌లో ఒకేసారి వేలాలు నిర్వహించడం ద్వారా ఇది భారతదేశంలోనే అతిపెద్ద ఫిజిటల్ (ఫిజికల్--డిజిటల్) వేలంగా నిలిచిందని సంస్థ స్టేట్ బిజినెస్ హెడ్ బి. తిమ్మరాజు తెలిపారు. ఒకే కలతో 15 సంవత్సరాల క్రితం ప్రారంభమైన సామిల్ నేడు దేశవ్యాప్తంగా విస్తరించి వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించిందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నట్లు తెలిపారు. సి ఎస్ ఆర్ కార్యక్రమంలో భాగంగా వాహన డ్రైవర్లు లేదా యజమానుల పేద పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందించడం, మినరల్ వాటర్ ప్యూరిఫైయర్ అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేశారు. అనంతరం లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామ్ ఫైనాన్స్ జోనల్ బిజినెస్ హెడ్ పి. రమణరాజు, రీజినల్ బిజినెస్ హెడ్ కే. రత్నాకర్, రీజినల్ క్రెడిట్ హెడ్‌లు, సామిల్ స్టేట్ బిజినెస్ హెడ్ బి. తిమ్మరాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా ప్రారంభమైన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు

**- జనసేన పార్టీ క్రియాశీలక తొలి సభ్యత్వం తీసుకున్న కొణతాల**



**అనకాపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** మాజీమంత్రి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ సభ్యత్వ కార్యక్రమం ను ఘనంగా ప్రారంభించారు. జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం సాధకులతో తో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు, కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నేటి నుండి ప్రారంభమైనందున పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకొని, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ఎవరైతే ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటారో, "ఎవరైతే పార్టీలో నాయకుడిగా ఎదగాలనుకుంటున్నారో వారు క్షేత్రస్థాయిలో పని చేసే కార్యకర్త కష్టాన్ని గుర్తించి అప్పుడే వారు పార్టీలో సంపూర్ణ నాయకులుగా ఎదుగుతారు అని అన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సాధకులు గ్రామస్థాయి.,మండల స్థాయి, వార్డు స్థాయిలలో , అందరూ ప్రధానపాత్ర వహించి ఉత్సాహంగా పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, గడచిన 2024 సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో సుమారు 22,954 మంది నమోదు చేసుకున్నారని, ఈ దఫా నమోదు కార్యక్రమంలో దాన్ని మించిపోయే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, రాష్ట్రంలో అందరికన్నా ఎక్కువ సంఖ్యలో అనకాపల్లి నియోజకవర్గంలో క్రియాశీలక సభ్యత్వాలు చేసి జనసేన అధ్యక్షులకు వారికి బహుమతిగా అందించాలని సాధకులకు పిలుపునిచ్చారు.. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమంలో మొదటగా కొణతాల రామకృష్ణ జనసేన పార్టీ తొలి క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం శ్రీ రామకృష్ణ చేతుల మీదగా తగరంపూడి మహిళలు, జనసేన నాయకులు,మాజీ సైనికులు,సభ్యులకు క్రియాశీలక సభ్యత్వం అందించారు . ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా ఉండని గ్రామాలు

**అచ్యుతాపురం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** మండలంలో గురు వారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఆప రేషన్స్ ఈఈ కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చుతాపురం సబ్ స్టేషన్ పరిధి లో ముసయ్యపేట, చోడపిల్లి అనకాపల్లి రోడ్డు రామాలయం వీధి కొత్తూరు గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

# విశాఖ వేదికగా దక్షిణాది రాష్ట్రాల ఎమ్మెల్యేల క్రీడాపోటీలు

**: శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**



**నర్సీపట్నం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యేల క్రీడా సంబరాలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు మాట్లాడుతూ, గత రెండు రోజులుగా క్రీడల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎంతో చురుగ్గా పాల్గొన్నారని, ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలు మైదానంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచారని కొనియాడారు. నిత్యం రాజకీయ ఒత్తిళ్లతో బిజీగా ఉండే ప్రజాప్రతినిధులు, ఆ టెన్షన్లను పక్కనపెట్టి పూర్తిస్థాయి క్రీడాకారుల్లా మైదానంలో రాణించడం ఎంతో సంతోషాన్నిస్తుందని ఆయన పేర్కొన్నారు. అందరిలో కనిపిస్తున్న ఈ క్రీడా స్ఫూర్తితోనే తనకొక వినూత్న ఆలోచన వచ్చిందని, త్వరలోనే దాన్ని ఆచరణలో పెడతామని ఆయన స్పష్టం చేశారు. దక్షిణ భారతదేశంలోని ఆరు రాష్ట్రాలకు చెందిన శాసనసభ్యులతో విశాఖపట్నం వేదికగా భారీ క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాల ఎమ్మెల్యేలందరినీ ఆహ్వానించి భారీ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియంతో పాటు, బీచ్ వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలకు కూడా అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ఈ మెగా క్రీడా సంబరాల ద్వారా దక్షిణాది రాష్ట్రాల మధ్య ఐక్యతను చాటడమే కాకుండా, రాజకీయంగా ఎలాంటి సమస్యలు, భిన్నాభిప్రాయాలు ఉన్నా క్రీడాస్ఫూర్తితో అంతా ఒకే వేదికపైకి వస్తామనే బలమైన సందేశాన్ని దేశం మొత్తానికి చాటిచెప్పవచ్చని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా జరగనున్న ఈ ప్రతిష్టాత్మక సౌత్ జోన్ ఎమ్మెల్యేల క్రీడా పోటీలను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షులు కేశినేని చిన్ని గారి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని స్పీకర్ వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించ తలపెట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పత్రికా, మీడియా ప్రతినిధులతో పాటు రాష్ట్ర ప్రజలందరి సహకారం, ఆశీస్సులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వడ్డాది వెంకటేశ్వర స్వామి కల్యాణం చూసొద్దాం రండి...

**- ఈ నెల 26 నుండి మార్చి4 వరకు కళ్యాణోత్సవాలు**





**బుచ్చయ్యపేట, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన వడ్డాది శ్రీవెంకటేశ్వర స్వామి 153వ వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఈనెల 26వతేదీ గురువారం నుండి మార్చి5వతేదీ బుధవారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 26వతేదీ గురువారం రాత్రి స్వామి వారి దొంగపెళ్లి, ధ్వజారోహణతో ప్రారంభమై మార్చి4వతేదీ పుష్పాంజలితో ముగుస్తాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు, హోమాదికములు, తిరువీధి,కళ్యాణ మహోత్సవం,మార్చి1న తిరువీదోత్సవం, సదస్యం,మార్చి3వ తేదీ మంగళవారం నాగవల్లి చక్రస్నానం నిర్వహిస్తారు. ఈ ఏడాది నాగవల్లి రోజున చంద్రగ్రహణం ఉన్నందున స్వామివారి చక్రస్నానం ఉదయం 11 గంటల లోపు కొండపైనే ముగించి ఆలయాన్ని మూసివేయనున్నారు. మళ్లీ మరుసటి రోజు తెల్లవారుజామున మాత్రమే ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి. పురవీధుల్లో ఊరేగింపు, వసంతోత్సవం రద్దు చేశారు. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ వైకుంఠ ఏకాదశికి వడ్డాది గిరిజాంబ గిరిపై శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి కల్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. స్థలపురాణం. ఈఆలయానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. 154 ఏళ్ల క్రితం శ్రీనారాయణ భజ్ అనే యోగి వచ్చి వడ్డాదికి దక్షిణ దిశగా వెంకటేశ్వర స్వామి నెలకొల్పపడతారని అది పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుందని చెప్పి దేశసంచారం నిమిత్తం వెళ్లిపోయారు. యోగి వెళ్లిన మరుసటి ఏడాదే గిరిజాంబగిరికి ఉత్తర దిశగా ఉన్న విజయరామరాజు పేటలో కాళ్ల వంశస్థులు బావిని తవ్వుతుండగా పది అడుగుల లోతులో వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి,భూదేవి విగ్రహాలు బయటపడ్డాయి. ఈవిషయాన్ని అప్పటి గ్రామపెద్ద దొండా భగవంతులయ్య దొరకు తెలియజేయడంతో విగ్రహాలను వడ్డాది గిరిజాంబగిరికి రప్పించి పురాణయుక్తంగా దేవాలయ నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ట చేయించారు. నాటి నుండి నేటి వరకు ప్రతి ఏటా స్వామికి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవాలయ నిర్వహణకు 60 ఎకరాల మాగాణి విరాళంగా ఇచ్చారు. 1970 దశకంలో ఆలయం దేవాదాయ శాఖ అధీనంలోకి వెళ్లింది. ఈస్థలానికి మహాభారత కాలం నాటి ఘటనలతో సంబంధం ఉన్నట్లుగా సింహాచలం దేవస్థానం ప్రచురణలలో పేర్కొన్నారు. మహాభారతంలో పాండవుల అజ్ఞాతవాసంలో విరాటరాజు పాలించిన మత్స్యదేశ రాజధాని అయిన విరాటపురమే నేటి వడ్డాది అని తెలుస్తోంది. పాండవులు గిరిజాంబగిరిని ఆనుకొని ఉన్న చెరువులో స్నానమాచరించి సంధ్యావందనం చేసేవారని,కనుకనే ఈచెరువును పాండవుల చెరువుగా పిలుస్తున్నారని తెలుస్తోంది. ధర్మ మూర్తులైన పాండవుల సంచరించిన ప్రాంతం కనుకనే వడ్డాది పరిసర గ్రామాలు సస్యశ్యామలమై పాడిపంటలతో తులతూగుతున్నాయని భక్తుల విశ్వాసం. ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు. ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వ్యవస్థాపక ధర్మకర్త దొండా కన్నబాబు, కార్యనిర్వహణాధికారి టి.ఎన్.ఎస్ శర్మ సంయుక్తంగా తెలిపారు. భక్తులు క్యూలైన్లో వెళ్లేందుకు బారికేడ్లు భారీగా,పోలీసు బందోబస్తు, వైద్య శిబిరము,త్రాగునీరు, ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశారు. కొండ వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోను, జంక్షన్లో స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలంకరణ,సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.






# సీఎం పర్యటన విజయవంతం చేద్దాం : కిమిడి



**చీపురుపల్లి ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 28న రావివలస పంచాయతీ పరిధిలోని పైలపేటకి రానున్న నేపథ్యంలో సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు పిలుపు నిచ్చారు. కళా వెంకటరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, ముఖ్యమంత్రి కార్యాలయ పర్యటన అధికారులు పెందుర్తి వెంకటేష్, ధనుష్, జిల్లా కలెక్టరు రాంసుందర్ రెడ్డి, జేసీ సేదు మాధవన్, సీఎం పర్యటన బాధ్యులు, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి, జిల్లా ఎఎస్పీ సౌమ్యలత, చీపురుపల్లి డీఎస్పీ ఎస్ రాఘవులు తదితరులు పైలపేట గ్రామాన్ని గురువారం సందర్శించారు. ముఖ్యమంత్రి హెలిపాడ్ తో పాటు భోజన విరామం తరువాత నియోజకవర్గ కార్యకర్తలతో జరిగే సమావేశ ప్రాంగణాన్ని ఎమ్మెల్యే కళాతో సహ అధికారులంతా పరిశీలించారు. అనంతరం సీఎం పాల్గొనే ప్రజావేదిక ఏర్పాట్లపై చర్చించారు. పంచాయతీ పరిధిలో జరిగే సమావేశానికి స్థానికులను ఎలా పంపాలో పోలీసు యంత్రాంగానికి తగిన సూచనలు చేశారు.

సీఎంఓ కార్యాలయాధికారులు సీఎం హెలీప్యాడ్ నుంచి నేరుగా చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రిలో జరిగే హెచ్ వీ వీ ఇంజక్షన్ కార్యక్రమంలో పాల్గొనే క్రమంలో భాగంగా సీఎం వచ్చి వెళ్లేంత వరకు అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనపై సీఎం కార్యాలయ సమన్వయ సిబ్బంది, భద్రతా సిబ్బంది, జిల్లా కలెక్టరు రాంసుందర్ రెడ్డి, జేసీ సేదు మాధవన్, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి, జిల్లా ఏఎస్పీ సౌమ్యలతతో కలిసి చర్చించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా జిల్లా అధికారులు తీసుకునే చర్యలును చర్చించారు. కలెక్టరు చెప్పిన ప్రతి అంశాన్ని చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అన్ని శాఖల ప్రధానాధికారులు, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, చీపురుపల్లి నియోజకవర్గ నాయకులు కె త్రిమూర్తులరాజు, సర్పంచ్ పనస మణికంత, రౌతు కాము నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వీఎంఆర్ డిఎ నుంచి రూ.10 కోట్లు మంజూరు

### – మంత్రి డాక్టర్ నారాయణ హామీ



**విజయనగరం కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు వీఎంఆర్ డిఎ నుంచి పది కోట్ల రూపాయలు మంజూరు చేసేందుకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ అంగీకరించారు. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు బుధవారం నారాయణను కలిసి నగర అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సుముఖత వ్యక్తం చేసి నగరపాలక సంస్థ పరిధిలో రహదారులు, కాలువలు, వీధి దీపాల కోసం వీఎంఆర్ డిఎ నుఊ 10 కోట్ల రూపాయల నిధులను త్వరలోనే మంజూరు చేస్తామని చెప్పినట్లు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు.

## పల్లిగండ్రేడులో అగ్నిప్రమాదం, పూరి ఇల్లు దగ్ధం



**గుర్ల, ఫిబ్రవరి26 (మేజర్ న్యూస్) :** పల్లిగండ్రేడు గ్రామంలో గురువారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదం లో పూరి ఇల్లు దగ్ధమైంది. పెనుమల రాములమ్మ,తన ఇంటి లో నిద్రావస్థలో ఉండగా అగ్నిప్రమాదం సంభవించింది.మంటలు వ్యాపించడం తో మెలుకువ వచ్చి ఆమే కేకలు వేయడం తో వీధిలో వారందరూ వచ్చి మంటలను అదుపు చేయడంతో ప్రాణ నష్టం తప్పింది.తన ఇంటికి కావాలనే నిప్పు పెట్టినట్లు రాములమ్మ అధికారులకు తెలిపింది.ఈ ప్రమాద ఘటన తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది ఆర్ ఐ.అప్పల రాజు,వి ఆర్ఓ .శ్రీనివాస నాయుడు వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించి భాదితురాలును వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ ప్రమాదం లో ఇరవై వేల రూపాయలు ఆస్తి నష్టం సంభవించి నట్లు అంచనా వేశారు.తాను చాలా పేదరాలని ప్రభుత్వం వారు ఆదుకొని తనకు నివాసం కల్పించాలని బాధితురాలు అధికారుల ముందు బోరున విలపిస్తుంది.

## ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి స్టీల్ ఎక్స్ చేంజ్ ఇండియా కంపెనీ రూ.10 లక్షల విలువైన వైద్య పరికరాల వితరణ






**శృంగవరపుకోట/ఎల్ కోట ఫిబ్రవరి 26 (మేజర్ న్యూస్) :** ఎస్ కోట మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి స్టీల్ ఎక్స్ చేంజ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ( సీఎస్ ఆర్) ఫండ్స్ తో ఐడీబీఐ బ్యాంక్ ద్వారా సమకూరిన రూ.10 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి,సేయిల్ జె ఏం డి బండి సురేష్ కుమార్ మరియు ఐడీబీఐ బ్యాంక్ విశాఖపట్నం జనరల్ మేనేజర్ కె. దాస్ లు గురువారం ప్రారంభించారు. ఐడీబీఐ బ్యాంక్ పెందుర్తి బ్రాంచ్ సమన్వయంతో అందిన ఈ విరాళంలో 12 ఛానల్ ఈసీజీ (ఈసీజీ), బ్లడ్ మిక్సర్, స్లిట్ ల్యాంప్, సీటీజీ (సిటిజి) మెషిన్, అప్లనేషన్ టోనోమీటర్ మరియు పోర్టబుల్ యూఎస్జీ (యూఎస్జి) మెషిన్ వంటి ఆరు రకాల కీలక పరికరాలను ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ విదంగా సేయిల్ కంపెనీ వారు, బ్యాంకింగ్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు.

## విద్యార్థులు, ప్రయాణీకులకు మత్తు పదార్థాలపై అవగాహన



**బొబ్బిలి, ఫిబ్రవరి 26 (మేజర్ న్యూస్) :** బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్లో గురువారం పట్టణ కె.సీఐ నారాయణరావు ఆధ్వర్యంలో గంజాయి వినియోగం, సైబర్ క్రైమ్ మరియు ఈవ్ టీజింగ్, వంటి నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలకు చట్టపరమైన పరిణామాలు, జాగ్రత్తలు గురించి వివరించారు. సోషల్ మీడియా మోసాలు, అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాజ భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సీఐ నారాయణరావు పిలుపునిచ్చారు.

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి ప్రత్యేక అధికారి



**లక్క వరపు కోట ఫిబ్రవరి 26 (మేజర్ న్యూస్) :** మండలంలో వేసవి దృష్ట్యా అన్ని గ్రామాలలో ప్రజలకు త్రాగు నీటి ఇబ్బంది తలెత్త కుండా తగిన చర్యలు తీసు కోవాలని ఎల్.కోట మండల ప్రత్యేక అధికారి జి.సత్యన్నారాయణ అధికారులకు సూచించారు గురువారం ఎంపీడీఓ ఆఫీస్లో అయన మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డ్రింకింగ్ వాటర్, శానిటేషన్, యూఎస్ఎఫ్ సర్వే, అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు అందరు అధికారులు సమన్వయం తో పని చేసి ఎటువంటి సమస్య లు లేకుండా చర్యలు తీసుకోవాలి అని అధికారులకు సూచించారు ప్రభుత్వ పథకాల అమలు కి సంబందించిన సర్వేలు వేగంగా పూర్తి చేయాలన్నారు. చందులూరు గ్రామంలోని సచివాలయంను సందర్శించి రికార్డులు పరిశీలించి అక్కడి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అల్లు భాస్కర రావు ఎంఈఒ కూర్మారావు ఇంచార్జి తహసీల్దార్ టీ రమేష్ మిగిలిన శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం




**నెల్లిమర్ల, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ :** మండలంలోని సతివాడ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఈఈ పి. త్రినాధరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటలు వరకూ సతివాడ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడు తుందన్నారు. ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, మధుపాడ, పినతరిమి, పెద తరిమి, బొడ్డపేట, బొప్పడాం, బుచ్చన్నపేట, వల్లూరు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

# పెందుర్తి పోలీస్ స్టేషన్ లో సీపీ ఆకస్మిక తనిఖీలు..

**- పరిశుభ్రత, పెండింగ్ కేసుల పరిష్కారంపై కఠిన ఆదేశాలు**









**పెందుర్తి, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఐపీఎస్ గురువారం సాయంత్రం నగరంలోని పెందుర్తి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లోని మొత్తం వ్యవస్థను నిశితంగా పరిశీలించిన ఆయన, సిబ్బంది పనితీరుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. స్టేషన్ పరిసరాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాలను వ్యర్థాలతో నింపకుండా పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన చోట శుభ్రపరిచే చర్యలు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. మరుగుదొడ్లను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. స్టేషన్‌లో తగిన సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు . పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, అన్ని రిజిస్టర్లు మరియు రికార్డులు ఎల్లప్పుడూ అప్డేట్‌గా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు.ఫిర్యాదుదారులకు మర్యాదగా వ్యవహరించాలి స్టేషన్‌కు ఫిర్యాదుల కోసం వచ్చే ప్రజలతో సిబ్బంది ఎలా స్పందిస్తున్నారో తెలుసుకున్న సీపీ, ఫిర్యాదుదారులను కూర్చోబెట్టి మర్యాదగా వారి సమస్యలు వినాలని, పారదర్శకంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. రౌడీ షీటర్లు, గంజాయి రవాణాపై ఉక్కుపాదం రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, గంజాయి రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. స్టేషన్ పరిధిలో ఒక్క గంజాయి పెడ్లర్ కూడా ఉండరాదని హెచ్చరించారు. విధుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగం జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠను కాపాడేలా ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.

# ఋషికొండ బీచ్‌లో విషాదం..

**- అలల ఉధృతితో అదుపు తప్పిన యువకుడు**

**- చత్తీస్‌ఘడ్‌కు చెందిన స్వప్నిల్ చౌహాన్ (25) దుర్మరణం**

**- స్నేహితుల కళ్లముందే ఘటన**







**మధురవాడ, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** సుందర దృశ్యాలకు ప్రసిద్ధి చెందిన ఋషికొండ బే పార్క్ బీచ్ వద్ద విషాదం చోటుచేసుకుంది. ఫోటోలు దిగుతున్న సమయంలో కాలుజారి సముద్రంలో పడిపోయిన చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన స్వప్నిల్ చౌహాన్ (25) మృతి చెందాడు. స్నేహితులతో సరదాగా గడపడానికి వచ్చిన ఈ యువకుడు క్షణాల్లోనే ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది. పోలీసుల వివరాల ప్రకారం, స్వప్నిల్ తన నలుగురు స్నేహితులతో కలిసి బీచ్‌కు వచ్చాడు. సాయంత్రం సమయంలో సముద్ర తీరానికి సమీపంగా నిలబడి ఫోటోలు దిగుతుండగా అకస్మాత్తుగా కాలుజారి నీటిలో పడిపోయాడు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో అతడు అదుపు తప్పినట్లు తెలుస్తోంది. అతడిని స్నేహితులు, స్థానికులు కలిసి వెంటనే బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న స్వప్నిల్‌ను తక్షణం కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్)కు తరలించారు. అయితే వైద్యులు పరిశీలించి అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఆరిలోవ పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ మల్లేశ్వరరావు పర్యవేక్షణలో పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయం, పరిస్థితులపై విచారణ కొనసాగుతోంది. యువకుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో తీవ్ర విషాదం నెలకొంది. సరదాగా గడపడానికి వచ్చిన యాత్ర విషాదంగా మారడంతో స్థానికులు సైతం దిగ్భ్రాంతికి గురయ్యారు. బీచ్ ప్రాంతాల్లో ఫోటోలు దిగేటప్పుడు, అలలకు సమీపంగా వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, సూచనలు పాటించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

## నిర్లక్ష్యంగా నడిపిన కారు సచివాలయ సెక్రటరీకి తీవ్ర గాయాలు..




**మధురవాడ, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** అతివేగంగా కారు నడిపిన ఓ వ్యక్తి బీభత్సం సృష్టించాడు. గురువారం నగరంపాలెం నుండి బోట్టవానిపాలెం (అయోధ్య నగర్) సచివాలయం రహదారిలో వెళ్తున్న జీవీఎంసీ మధురవాడ జోన్ 70వ సచివాలయం డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ దుర్గాప్రసాద్ ను వెనుక నుంచి కారుతో ఢీకొట్టాడు. ఈ ఘటన సచివాలయానికి కూతవేటు దూరంలోనే ఈప్రమాదం జరిగింది. డీ కొట్టిన అనంతరం డ్రైవర్ కారు ఆపకుండా నిర్లక్ష్యంగా శివశక్తినగర్ మీదుగా వైఎస్సార్ కాలనీకి వెళ్లి తప్పించుకునే ప్రయత్నం చేసాడు. స్థానికులు వెంబడించి అక్కడ కారును గుర్తించారు. ఈ ప్రమాదంలో సచివాలయ సెక్రెటరీ దుర్గాప్రసాద్ కు గాయాలు అయ్యాయి. గాయపడిన దుర్గాప్రసాద్ ను స్థానికులు గాయత్రి ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై సచివాలయం సెక్రటరీ దుర్గా ప్రసాద్ ఎటువంటి పిర్యాదు చేయకపోవటం పై పోలీసులు కేసు నమోదు చేయలేదు.

## పెప్టైడ్ ఆధారిత ఔషధాలకు పెరుగుతున్న ప్రాధాన్యత




**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** గీతం ఇండియన్ పెప్టైడ్ సొసైటి సదస్సులో నిపుణులు మధుమేహం, ఊబకాయం, కేన్సర్ మరియు సంక్రమిత వ్యాధుల నివారణలో పెప్టైడ్ ఆధారిత ఔషధాలకు ప్రాధాన్యత పెరుగుతోందని ముఖ్యంగా నాణ్యత, తక్కువ వ్యయం, ఖచ్చితమైన చికిత్సకు ఇవి ఉపయోగపడతాయని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా గురువారం నిర్వహించిన ఇండియన్ పెప్టైడ్ సొసైటి (ఐపిఎస్) 5వ విద్యార్థి వార్షిక సదస్సులో నిపుణులు పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, స్కూల్ ఆఫ్ ఫార్మశీ, ఇండియన్ పెప్టైడ్ సొసైటి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఐపిఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.ఎన్.గణేష్ ముఖ్యఅతిధిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ వంటి చికిత్సలకు సహితం పెప్టైడ్ మందులను వాడటం ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతోందని తెలిపారు. మధుమేహం దేశంలో వేగంగా పెరుగుతున్న రుగ్మతలలో ఒకటి అని దీని చికిత్సకు పెప్టైడ్ ఆధారిత ఔషధాలు అవసరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి కేంద్రంగా ఏర్పాటవుతున్న క్వాంటమ్‌వ్యాలీ ద్వారా పెప్టైడ్ ఆధారిత ఔషధ పరిశోధనలు వేగవంతం అవుతాయన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంతరామకృష్ణ మాట్లాడుతూ గీతంలో సైన్స్ పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, దాదాపు రూ.100 కోట్లతో అధునాతన ప్రయోగశాలలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 100 కు పైగా పెప్టైడ్ మందులు ఆమోదం పొందాయని భవిష్యత్తులో వీట సంఖ్య మరింతగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ప్రొఫెసర్ ఎ.రామ్‌గోపాల్, కార్యక్రమ కోఆర్డినేటర్‌లు డాక్టర్ శిబాజీబాసక్, డాక్టర్ నితిన్ యాదవ్, డాక్టర్ రాజ్‌దీప్ దాస్, అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చి స్కాలర్స్ తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు అండగా ఉన్నాం : కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**- డయేరియ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర మంత్రి.**

**- నాలుగు రోజుల్లోనే సాధారణ స్థితికి పరిస్థితులు.**

**- కలెక్టర్ కార్యాచరణ భేష్.**

**- మృతుడు సురేష్ కుటుంబానికి, ఆసుపత్రులలో రోగులను పరామర్శించిన రామ్మోహన్ నాయుడు.**

**- కూటమి సర్కారు తోడుగా ఉందని., ధైర్యంగా ఉండాలని అభయం.**



**శ్రీకాకుళం ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్:** అనూహ్యంగా శ్రీకాకుళం నగరాన్ని డయేరియా వ్యాధి ఇబ్బంది పెడితే.. జిల్లా యంత్రాంగం దాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొని.. తిరిగి నాలుగు రోజుల్లోనే సాధారణ స్థితికి తీసుకువచ్చారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గురువారం నాడు శ్రీకాకుళం నగరంలో డయేరియా ప్రభావిత ప్రాంతాలు అయిన మంగువారితోట దగ్గరలోని కంద్ర వీధి, ధమ్మల వీధి ప్రాంతాలలో వ్యాధి బారిన పడ్డ వారిని, ఇటీవల ఆసుపత్రి నుండి డిశ్చార్జి అయినవారిని, అదేవిధంగా వ్యాధి కారణంగా మృత్యువాత కంద్ర వీధికి చెందిన  పడ్డ సురేష్ కుటుంబాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ లతో పాటుగా పరామర్శించారు. అనంతరం కిమ్స్, జేమ్స్, రిమ్స్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి.. వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తామని ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. శ్రీకాకుళం నగరంలో నాలుగు రోజుల క్రితం డయేరియ కేసులు నమోదు ప్రారంభం అయితే రాష్ట్ర ప్రభుత్వం సత్వరం స్పందించి.. క్షేత్ర స్థాయిలో నిరంతర పరిశీలన, సమీక్షలు చేస్తూ.. నిన్నటికే సాధారణ స్థితికి తీసుకొచ్చారని అన్నారు. తాజాగా నేడు శ్రీకాకుళం నగరంలోని ప్రభావిత ప్రాంతాల్లో తాను సైతం పర్యటించానని.. అధికార యంత్రాంగం సత్వరం స్పందించారని తెలిపారు. డయేరియా కారణంగా మృతి చెందిన సురేష్ కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని ధైర్యాన్ని ఇచ్చినట్టు స్పష్టం చేశారు. ప్రస్తుతానికి జెమ్స్, కిమ్స్, రిమ్స్, జి.జి.హెచ్ ఆసుపత్రులలో నిన్నటికి 124 కేసులు ఉండగా.. అందులో ఇరవై రెండు డిశ్చార్జి కావడంతో 102 కేసులు ఉన్నాయని అన్నారు. ఇందులో కొన్ని మాత్రమే ఇబ్బంది ఉండగా.. మిగిలిన వారి పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. తొలి కేసు నమోదు అయిన నాటి నుండే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సత్వరం స్పందించారని.. క్షేత్ర స్థాయిలో పర్యటనలు జరిపి.. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని అన్నారు. డయేరియా తరహాలో చిన్న ఇబ్బంది ఉన్నా.. వారికి ఆసుపత్రులలో మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. మంచినీటి సమస్యపై ఇప్పటికే శాంపిల్ లను కూడా తీసుకుని పరిక్షల కోసం పంపించామని.. ఫుడ్ ద్వారా ఇబ్బంది జరిగిందా అన్న కోణంలో కూడా విశ్లేషణ జరుపుతున్నారని అన్నారు. అన్ని దిశల్లో దర్యాప్తు చేసి.. వ్యాధి ఉధృతికి గల ఆసలు కారణాన్ని తెలియపరుస్తామని అన్నారు. ఇంకోవైపు నగరంలో మంచినీటి సరఫరాపై కూడా మంత్రి నారాయణ క్షేత్ర స్థాయిలో పర్యటన చేసి పూర్తి పరిశీలన చేశారని అన్నారు. ఆయన పలు సూచనలు చెయ్యగా.. ఆ దిశగా అభివృద్ధి పనులు కూడా కార్యరూపం దాల్చాయని అన్నారు. గతంలో కార్పోరేషన్ ను సిండికేట్ గా మారి దగా పరిచారని.. వాటికి స్వస్తి పలుకుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్వచ్ఛాంధ్ర పిలుపుతో శానిటేషన్, ఇతర శుభ్రత కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని.. ఎవ్వరూ ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. మంత్రి నారాయణ తెలిపిన మేరకు సుమారు 100 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల ద్వారా కార్పోరేషన్ అభివృద్ధి దిశగా సమూల మార్పులు చేస్తూ అభివృద్ధికి పథకరచన చేశామనియా అన్నారు. సుడా ద్వారా మరో 12కోట్ల రూపాయల ద్వారా డ్రేయిన్లను ఆధునీకరిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ కె. అనిత, జిజిహెచ్ సూపరిండెంట్ ఎల్ ప్రసన్న కుమార్, రిమ్స్ ప్రిన్సిపల్ ఎస్. అప్పలనాయుడు, ఆర్ ఎంఓ సుభాషిని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






# అగ్నిప్రమాద బాధితులకు కృష్ణ చైతన్య పరామర్శ..



**జలుమూరు ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్:** మండలంలోని రామకృష్ణాపురంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులను వైఎస్ఆర్సీపీ యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య గురువారం పరామర్శించారు. గ్రామానికి చెందిన మారెళ్ల ఎర్రయ్య, మారెళ్ల లచ్చమ్మ, వాడాన రాజు, వాడాన బోగెమ్మలకు చెందిన ఇళ్లు మంటల్లో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కృష్ణ చైతన్య గ్రామానికి చేరుకుని బాధితులను ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరును, జరిగిన ఆస్తి నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. కట్టుబట్టలతో మిగిలిన బాధితుల పరిస్థితిని చూసి ఆయన చలించిపోయారు. ఘటన స్థలం నుంచి స్థానిక ఎమ్మార్వో తో మాట్లాడి తక్షణమే బాధితులకు ప్రభుత్వ పరంగా సాయం అందించాలని కోరారు . ఈ కార్యక్రమం లో నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ధర్మాన జగన్ మోహన్ , మండల విభాగం అధ్యక్షులు పొన్నాన ముసలి నాయుడు , సర్పంచ్లు రేగాన శ్యామ్ , ధర్మాన రమణమూర్తి , తాడేల త్రినాధరావు , ఎంపిటిసి సవాలాపురపు అదిబాబు, మండల యూత్ ఉప అధ్యక్షులు కళ్యాణం శ్రీనివాస్, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి కొబగాపు నాగరాజు , మండల ప్రధాన కార్యదర్శి నడుపూరు గోవింద , మండల సాంస్కృతిక అధ్యక్షులు పిట్ట వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# వెట్టిచాకిరీ నిర్మూలన సామాజిక బాధ్యత



**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్:**జిల్లాలో వెట్టిచాకిరీని పూర్తిగా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టం అమలులోకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ), నేచర్ ఎన్జీఓ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు ఆవరణలో అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి, సంచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న అప్పుకు ప్రతిఫలంగా తక్కువ వేతనం లేదా అసలు వేతనం లేకుండా బలవంతంగా పనిచేయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఈ చట్టం ప్రకారం వెట్టిచాకిరీ కింద ఉన్న పాత అప్పులన్నీ రద్దవుతాయని, బాధితులు ఆ అప్పును తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని, వారి ఆస్తులు యజమాని వద్ద తనఖాలో ఉంటే వాటిని విడిపించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. వెట్టిచాకిరీ చేయించుకునే యజమానులకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధిస్తారని జడ్జి హెచ్చరించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె. హరిబాబు మాట్లాడుతూ.. 1976 నిర్మూలన చట్టం దేశవ్యాప్తంగా వెట్టిచాకిరీని రద్దు చేసిందని, ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. ముఖ్యంగా అసంఘటిత రంగాల్లోని కార్మికులు ఈ దోపిడీకి గురవుతున్నారని, వారిలో చైతన్యం తెచ్చేందుకు ఈ సంచార వాహనం జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, నేచర్ ఎన్జీఓ డైరెక్టర్ ఎస్. వికాస్, ప్రతినిధులు చైతన్య, దుర్గ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




## పాలకొండ పట్టణం లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి



**పాలకొండ, మేజర్ న్యూస్ :** పాలకొండ పట్టణ పరిశుభ్రత విషయంలో ప్రాదాన్యత ఇవ్వాలని పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాద్ అన్నారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ప్రతి వార్డులో 100% శాతం ఇంటింటి నుండి చెత్త సేకరణ చెయ్యాలి, వార్డులో ప్రతి ఇంటి వారికి రోడ్ మీద, కాలువలో చెత్త వేయకుండా ఉండేలా అందరికీ తెలియజేయాలని మరియు ప్రతి వార్డులో కాలువలు 15 రోజులకి ఒక సారి క్లీన్ చేయాలని సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ రతన్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్




**పార్వతీపురం, ఫిబ్రవరి 26 (మేజర్ న్యూస్) :** పార్వతీపురం పట్టణ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద గల ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి తనిఖీ చేశారు. నెల వారీ తనిఖీలో భాగంగా గురువారం ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టరులో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ, ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని ముస్తాబుగా తయారు చేయాలి

### – ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్





**సీతంపేట, మేజర్ న్యూస్ :** సీతంపేట మండలంలోని పెదరామ గ్రామాన్ని ముస్తాబుగా తయారు చేయాలని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ అన్నారు. గురువారం ఆయన పెదరామ గ్రామాన్ని పరిశీలించారు. గ్రామంలోని అన్ని వీధులను తిరిగి గ్రామాన్ని ముస్తాబుగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు, గ్రామస్తులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, కూర్చోవడానికి వీలుగా బెంచీలను ఏర్పాటు చేయాలని, రోడ్డుకి ఇరువైపులా మొక్కలను నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీ కన్య, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సామాగ్రి ద్వారా బోధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, సర్పంచ్ తిరుపతి రావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీలును పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించాలి

### – అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర




**పార్వతీపురం, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ :** రాష్ట్రానికి పెద్ద ఎత్తున పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడం అవసరమేనని, అయితే అదే సమయంలో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ యువకులను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే విజయ్ చంద్ర మాట్లాడుతూ అంకెల్లో కొన్ని నెంబర్లు, ఇంగ్లీష్ అక్షరాల్లో కొన్ని అక్షరాలు తీసేస్తే అటు సంఖ్యా పూర్తి కాదు ఇటు పదాలు పూరించబడవని అలాగే ఎస్సీ ఎస్సీలను పూర్తిగా పక్కన పెడితే ఆ వ్యవస్థ సంపూర్ణంగా అభివృద్ధి చెందదని స్పష్టం చేశారు. ఎస్సీ ఎస్టీల్లోని ఔత్సాహిక యువతను గుర్తించి తగు స్థాయిలో సబ్సిడీలు విడుదల చేసి ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యంగా చిన్న మధ్య తరగతి మైక్రో కంపెనీలు ఏర్పాటుకు వారికి సాయమందించాలని కోరారు. పక్కనున్న కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల మాదిరిగా ఎక్కువ మొత్తంలో సబ్సిడీలు విడుదల చేసి తక్కువ ధరకు భూములు కేటాయించి ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఇంటి పన్ను వసూళ్ళు వేగవంతం చేయాలి : ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్




**సీతానగరం, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను బకాయి వసూళ్లను గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నతా ధికారుల నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాల్సి ఉందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. మండల పరిధి పెదభోగిలి పంచాయతీ హాడ్కో కాలనీ లో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శి 2 ఉషారాణి ఆధ్వర్యంలో ఎంపీడీవో. డిప్యూటీ ఎంపీడీవో కేకే వర్మ ఇంటింటికి వెళ్లి ఇంటి పన్ను బకా యిలు వసూళ్ల పై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ సాధ్యమంతవరకు ఇంటి పన్ను బకా యిలు వసూలు చేయడం జరిగింది.

అనంతరం గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శికి ఇంటి పన్ను బకాయిలు వసుళ్లకు సంబంధించి తగు సూచ నలు సలహాలను అందజేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి పన్ను బకాయిలు వసూళ్లకు సంబంధించి గ్రామ పంచా యతీ కార్యదర్శులకు లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని గ్రామ పంచాయతీల వారీగా ఉన్నతాధి కారులు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామ పంచాయతీలు వారిగా వసూలు చేసిన ఇంటి పన్ను బకాయిలను ఆన్ లైన్ లో వసూలు చేయాల్సి ఉందని .ఇంటి పన్ను బకాయలు వసూళ్లకు సంబంధించి ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యా లను అధిగమించని గ్రామ పంచాయతీ కార్యదర్శులపై తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేకే వర్మతో పాటు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన డీఆర్ఓ



**పార్వతీపురం, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ :** జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణను జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ఆర్.కె.జూనియర్ కళాశాల మరియు పి.ఎస్.ఎం. వాసవి జూనియర్ కళాశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆమె సందర్శించి, పరీక్షల సరళిని, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డి.ఆర్.ఓ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు, గదుల్లోని ఇతర కనీస సదుపాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, సిబ్బంది ఎవరూ సెల్ ఫోన్లు లోపలికి తీసుకురాకూడదని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ఆమె సూచించారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, చీఫ్ సూపరింటెండెంట్లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# హామీలు అమలు మరిచిన చంద్రబాబు మళ్ళీ పర్యటన : వైసీపీ



**చీపురుపల్లి ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :** చంద్రబాబు గతంలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చెయ్యకుండా మరల ఏ వాగ్దానాలు ఇవ్వడానికి చీపురుపల్లి వస్తున్నారని జిల్లా వైస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, మీసాల వరహాల నాయుడు ప్రశ్నించారు. స్థానిక వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే బాలకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే కళా వెంకటరావు అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లో ఆర్.ఇ.సి.ఎస్ తీసుకొని వస్తామని ఇక్కడ ప్రజలకు హామీ ఇచ్చారని, చీపురుపల్లి ఏరియా హాస్పిటల్ని 100 పడకల ఆసుపత్రిగా చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

అదేవిధంగా మూడవ అంశం తోటపల్లి కాలువ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే తోటపల్లి కాలువని పూర్తి చేస్తామని చెప్పు కనీసం తోటపల్లి పిల్ల కాలువలో పూడికలు కూడా తీసే పరిస్థితి లేదన్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో గరివిడి ఫేకర్ మూత పడడంతో కొన్ని వందల కుటుంబాలు వీధిన పడ్డారని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే ఫేకర్ యాజమాన్యతో మాట్లాడి ఫేకర్ తెరిపించే బాధ్యత తీసుకుంటానన్న విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రధాన సమస్యలు తీర్చలేక మరి ఇప్పుడు ఏమి గాలి వాగ్దానాలు ఇవ్వడానికి వస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, ఎంపీటీసీలు గెరిడి రామదాసు, ముళ్ళు పైడిరాజు, బాణాన రమణ, ఇప్పిలి రాము, బాణాన శ్రీనివాసరావు, రేవల్ల సత్తిబాబు, ప్రభాత్ కుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహాల ప్రతిష్టాపనకు “ కోట్ల” ఆర్థిక సహకారం

## శ్రీ రమణ సేవా ఆశ్రమంకు రూ.12 వేల వితరణ



**పూసపాటిరేగ, ఫిబ్రవరి26, మేజర్ న్యూస్ :** భిన్న మతాలను దైవత్వంగా భావించిన కోట్ల రఘు మరో అడుగు ముందుకు వేశారు. ఇప్పటివరకు పలు దేవాలయాలకు, చర్చిలకు ఆర్థిక సహకారాన్ని అందించిన కోట్ల రఘు తాజాగా వెంపడం గ్రామంలో దేవాలయంలో ప్రతిష్టించనున్న విగ్రహాలకు తన వంతు ఆర్థిక సాయం గా రూ.12 వేలు చెక్కు రూపంలో గురువారం అందజేశారు. తన దేవాలయంలో విగ్రహాల ప్రతిష్టకు ఆర్థిక సహకారాన్ని అందించాలని జనసేన నాయకుడు, కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు రఘును సేవా ఆశ్రమ నిర్వాహకులు రమణ మహర్షి ఆశ్రయించగా, రఘు అడిగిందే తడువుగా తన సొంత సొమ్మును విరాళంగా అందజేసి రమణ మహర్షి ఆశీస్సులను పొందారు. ప్రజలతో పాటు ఆలయాల నిర్మాణాలకు నిరంతర ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న రఘు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిగా నిలవాలని రమణ మహర్షి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రఘు యువసేన సభ్యులు కూడా పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

## - సెంట్రల్ నోడల్ ఆఫీసర్ నీరజ్ కుమార్



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ :** విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేయాలని పిఎంశ్రీ సెంట్రల్ నోడల్ అధికారి నీరజ్ కుమార్ గాయగీ చెప్పారు. పిఎంశ్రీ స్కూల్స్ సందర్శనలో భాగంగా ఆయన సతివాడ ఆదర్శ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు, ఎపిసి ఎ రామారావుతో కలిసి గురువారం సందర్శించారు. సెంట్రల్ నోడల్ అధికారి నీరజ్ కుమార్ పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, మౌలిక వసతులు, డిజిటల్ బోధన విధానాలపై సమీక్షించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి, విద్యార్థుల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులతో చర్చించారు. కొత్త జాతీయ విద్యా విధానం--2020 ప్రకారం బోధన జరుగుతున్న విధానాన్ని ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసిస్తూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ జె పద్మలత, ఉపాధ్యాయులు పాఠశాల పురోగతిపై వివరాలు తెలియజేశారు. ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను పాఠశాల అభివృద్ధికి వినియోగించినందుకు ప్రిన్సిపాల్ ని అభినందించారు. అనంతరం వసతిగృహాన్ని సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ఆహారాన్ని రుచి చూసి భోజనం నాణ్యత బాగుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఓ యు సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

# అన్ని తానై వైద్య సేవలు అందిస్తున్న హోమియో వైద్యాధికారి



**గుర్ల, ఫిబ్రవరి 26 (మేజర్ న్యూస్) :** మండల కేంద్రమైన గుర్ల లో హోమియో వైద్యశాలకు అన్ని తానై సేవలు అందిస్తున్న వైద్యాధికారి, పేరుకే వైద్యాధికారి తప్ప అన్ని అవతారాలు తాను ఎత్తుతూ వైద్య సేవలు అందిస్తున్నారు. ఒకప్పుడు ఈ వైద్యశాలకు వైద్యాధికారితో పాటు కాంపౌండర్ ఉండేవాడు.కొంతకాలం తర్వాత అతనిని బదిలీపై పంపించేశారు.ఆ తర్వాత కాలాను కొనంగా కొన్నాళ్ల తర్వాత కాంపౌండర్ వేయడం మర్చిపోయారా లేక పూర్తిగా తీసేసారా అన్నది నేటికీ కానరావడం లేదు.ఆ తర్వాత వైద్యాధికారి పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు.కాంపౌండర్ ను వేయడం ఉన్నతాధికారులు మరిచిపోయారు.ఇక్కడ హోమియో వైద్యం ద్వారా అనేకమంది రోగులు రోజూవచ్చి సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. హోమియో వైద్యశాల ఏర్పాటు నుండి నేటి వరకు ప్రభుత్వం అందిస్తున్న హోమియో వైద్యం పై రానురాను ప్రజలలో నమ్మకం పెరుగుతుంది.ఇక్కడికి వస్తే నయమవుతుందని ఇక్కడ వారే కాకుండా సుధీర ప్రాంతాలు నుంచి కూడా రోగులు వస్తున్నారు.మంచి వైద్యం అందించినప్పుడు రోగులుతాకిడి పెరుగుతుందని అందరికీ తెలిసిందే.ఈ నేపథ్యంలో పేరుకే వైద్యాధికారి తప్ప అటు కాంపౌండర్ అవతారం ఇటు వైద్యాధికారి అవతారం తానే ఎత్తుతూ సేవలందిస్తున్నారు.ఎలాంటి ఆసుపత్రికి వెళ్లిన వైద్యాధికారితోపాటు కాంపౌండర్ ఉంటారన్నది రోగులు కు తెలిసిందే,దీంతో వైద్యాధికారి శ్రమను చూసిన రోగులు కాంపౌండర్ ఉంటారు కదండీ ప్రశ్నలు సంధిస్తున్నారు.దీనికి సమాధానం చెప్పలేక వైద్యాధికారి మింగుడు మింగక తప్పడం లేదు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాంపౌండర్ ఏర్పాటు చేయాలని అక్కడికి వచ్చిన రోగులు,మండల ప్రజలు కోరుతున్నారు.

# 1న అంబేద్కర్ గురుకులం ప్రవేశ పరీక్ష



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ :** మార్చి1న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. ఉషారాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడారు. 1న ఆదివారం 5వ తరగతికి ఉదయం 9.30 నుండి 11.00 గంటల వరకూ అలాగే జూనియర్ ఇంటర్మీడియట్ 12 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలు వరకూ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అదే విధంగా జూనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐఐటి /నీట్ కోర్సుకి ప్రవేశ పరీక్ష అదే రోజు మధ్యాహ్నం 3నుండి 4.30 గంటలు వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. కాగా వాటికి సంబంధించి హాల్ టికెట్స్ ఖజూఎతీఖుస్త్రషవ్.స్త్రశీజ.ఱఅ లో నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చుని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకి హాజరు అయ్యేవారు ఒక గంటముందుగా పరీక్ష హాల్ కి హాజరు కావాలని సూచించారు. నీలం లేదా నలుపు బాల్ పాయింట్ పెన్స్ మాత్రమే వాడాలని జెల్ పెన్స్ వాడరాదన్నారు. సంబంధిత విదార్థ ఆధార్ కార్డు జెరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో తప్పని సరిగా తీసుకు రావాలని ప్రిన్సిపాల్ కె.ఉషారాణి తెలిపారు.

## జేఎన్టీయూ-జీవీ ఇంజనీరింగ్ కళాశాల ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రభూషణరావు



**విజయనగరం (మేజర్ న్యూస్) :** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కె. చంద్ర భూషణ్ రావు బుధవారం అధికారికంగా జేఎన్‌టీయూ–జీవీ ఇంజినీరింగ్ కళాశాల నూతన ప్రిన్సిపాల్ (ఇన్ ఛార్జ్)గా బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఆయన జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ గురజాడ విజయనగరంలో డైరెక్టర్ (అకాడెమిక్ ఆడిట్ అండ్ ప్లానింగ్) గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆ పదవిలో ఆయన విద్యా ప్రమాణాల మెరుగుదల, అకాడెమిక్ విధానాల అమలు, నాణ్యతా పరిశీలన వ్యవస్థల బలోపేతం, సంస్థాగత ప్రణాళికల రూపకల్పనలో విశేష సేవలు అందించారు. ప్రొఫెసర్ డాక్టర్ చంద్ర భూషణ్ రావు అకాడెమిక్ ప్రతిభ, పరిపాలనా అనుభవం విద్యానాణ్యత పెంపు పట్ల అంకితభావం కలిగిన విద్యావేత్తగా విశేష గుర్తింపు పొందారు. ఆయన ప్రధాన పరిశోధనా రంగాలు యాంటెన్నాస్, టెలికమ్యూనికేషన్ సాంకేతికతలు. ఈ రంగాల్లో ఆయన అనేక పరిశోధనలు నిర్వహించి విద్యార్థులకు సమర్థవంతమైన మార్గదర్శకత్వం వహించారు. అదేవిధంగా, జాతీయ స్థాయి నాణ్యతా ప్రమాణాలైన ఎన్ బిఎ, ఎన్ఎఎసి అక్రెడిటేషన్ విధానాలలో ఆయనకు విశేష నైపుణ్యం ఉంది. అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అమలు, నాణ్యతా ప్రమాణాల సాధన, సంస్థాగత అభివృద్ధి వంటి అంశాల్లో ఆయన అనుభవం కళాశాల అభివృద్ధికి కీలకంగా మారనుంది.

## ఘనంగా రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ :** మండలంలోని రామతీర్థం పంచాయతీ పరిధి దేవుని నెలివాడలో వెలసిన శ్రీ రాజరాజేశ్వరి ఆలయ 11వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన చండీ హోమంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం వేదపండితలు ఆమెకు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, చిన్నశ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ పథకం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగు పడాలి : ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్





**సీతంపేట, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ :** సీతంపేట ఐటిడిఏ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తామని ఐటిడిఏ పీవో పవార్ స్వప్నిల్ అన్నారు. గురువారం ఆయన పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం ద్వారా పాఠశాలకు అనేక రకాల సదుపాయాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. వీటి ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరుచుటకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో అన్ని మరుగుదొడ్లను పరిశీలించి మరింత శుభ్రంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారికి బోధిస్తున్న డిజిటల్ తరగతులను పరిశీలించారు. విద్యార్థుల సైన్సు ల్యాబ్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంధాలయాన్ని పరిశీలించి విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమావాణి ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 150 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం : వ్యవసాయాధికారుల ప్రాథమిక అంచనా





**రామభద్రపురం, ఫిబ్రవరి 26 (మేజర్ న్యూస్) :** మండలంలో బుధవారం కురిసిన అకాల వర్షాలకు సుమారు 150 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి అమరా శివ ప్రాథమిక అంచనా వేశారు. ఈ మేరకు గురువారం వంట నష్టం జరిగిన బూసాయవలస, ముచ్చర్లవలస గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగతా గ్రామాల్లో రైతు సేవా కేంద్ర సిబ్బంది క్షేత్ర సందర్శన చేస్తున్నారని, మొత్తం నివేదికను జిల్లా వ్యవసాయాధికారులకు అందించనున్నామని తెలిపారు.

ఇంకా మె ఎక్కజొన్న పంటతోపాటు మిగతా పంటలకు నష్టం వాటిల్లింది లేనిదీ కూడా సర్వే చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వెంకటరమణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది బి.రాజశేఖర్, మొక్కజొన్న పంట బాధిత రైతులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ గ్రామీణ రోజ్ గార్ మరియు అజీవిక మిషన్ గ్రామీణ మండల కన్వీనర్‌గా చెలికాని

**బొబ్బిలి, ఫిబ్రవరి 26: మేజర్ న్యూస్ :** వికసిత్ భారత్ గ్రామీణ రోజ్గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్ బొబ్బిలి మండల కన్వీనర్ గా చెలికానికేశవను ఎంపిక చేశారు. ఇతర మెంబర్లు చుక్క తిరపతి నాయుడు (కృష్ణాపురం ), తాడ్డి రామారావు (పారాది), నల్ల బలరాం నాయుడు (పిరిడి) నియమిస్తున్నట్లు విజయనగరం జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు లింగాల సూర్యనారాయణ, కార్యదర్శి ముగడు అనిల్ , మరియు విజయనగరం జిల్లా కో కన్వినర్ పెంట స్వామినాయుడు ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. బొబ్బిలి ఫుల్ బాగ్ బిజెపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి బిజెపి బొబ్బిలి నగర ఉపాధ్యక్షులు జాగాన త్రినాథ్ మండల అధ్యక్షులు తాడ్డి ఈశ్వర రావు, బొబ్బిలి బిజెపి లీగల్ అడ్వైజర్ దామెర తరుణ్ రేవంత్ తదితరులు రెడ్డి అచ్యుత రావు పాల్గొన్నారు.



## పాడి రైతులను ప్రోత్సహించేందుకే ఆడదూడల ప్రదర్శనలు : డాక్టర్ అవినాష్

**దత్తిరాజేరు (మేజర్ న్యూస్) :** పాడి రైతులను ప్రోత్సహించటమే ప్రభుత్వ ధ్యేయంగా ఆడదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ అవినాష్ అన్నారు. మండలంలో



గురువారం ఎస్ చింతలవలస గ్రామంలో జిల్లా పశు సంవర్ధక శాఖ మరియు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆడదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అధిక పాల దిగుబడి నిచ్చే దూడలను ప్రోత్సహించడం తద్వారా పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. ఆడదూడలు ప్రదర్శన కార్యక్రమం ద్వారా ఉత్తమ దూడల పెంపకంలో ఎంపిక కాబడిన బొత్స తిరుపతి, కంది రమణ, గెద్ద పెంటం నాయుడు లకు మొదటి, ద్వితీయ, తృతీయ, బహుమతులు అందజేయడం జరిగిందన్నారు. మండలంలో ప్రతి పశు వైద్య డిస్పెన్సరీ స్థాయిలో ఆడదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ వైద్యాధికారి ఎంవి జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కంది తిరుపతి నాయుడు, స్థానిక నాయకులు, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పాలకొండ, మేజర్ న్యూస్ :** పాలకొండ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. పవర్ ట్రాన్స్ ఫార్మర్లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా నేడు శుక్ర వారం మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పాలకొండ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. విష్ణు మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ పాలకొండ సబ్ స్టేషన్ పరిధిలోకి వచ్చే పాలకొండ టౌన్ మరియు రూరల్ ప్రాంతాలైన గొట్ట మంగళాపురం, చిన్న మంగళాపురం, గోపాలపురం, సింగన్నవలస, కొండా పురం, అంపిలి, అన్నవరం, బుక్కూరు, తంపటపల్లి తదితర గ్రామాల్లో ఈ కోత అమలులో ఉంటుంది. మరమ్మతు పనుల దృష్ట్యా వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని అధికారులు కోరారు. పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు.

## ఆలయాలు నిర్మాణం కోసం వైస్ ఎంపీపీ దంపతులు విరాళాలు



**దత్తిరాజేరు (మేజర్ న్యూస్) :** మండ లంలో పోరలి గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి రమేష్ వైస్ ఎంపీపీ, మిత్తిరెడ్డి ధనలక్ష్మి, సర్పంచ్ దంపతులు పలు గ్రామాలలోని ఆలయ నిర్మాణ పనులకు ఆర్థిక సహాయము అందజేయడం జరిగిందని గురువారం స్థానిక విలేకరులకు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులకు ఆర్థిక సహాయం అందజేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపట్టడం జరుగు తుందని, ఆలయాలు గ్రామ ప్రజలకు ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. టి.బూర్జవలస శివాలయంకి లక్ష రూపాయలు, చినరాజేరు రామాలయంలో గేట్లు నిర్మాణ మునకు 38 వేల రూపాయలు, కోమటిపల్లి లో దుర్గాదేవి ఆలయంలో గేట్లు నిర్మాణంకు 28 వేల రూపాయలు, దాసుపేట రామాలయం నిర్మాణం కోసం లక్షా50 వేలు రూపాయలు, గడసాం బంగారమ్మ తల్లి ఆలయము నిర్మాణం కోసం 60 వేల రూపాయలు విరాళాలు అందజేయడం జరిగిందని అన్నారు. అదే విధంగా మండలంలో పలు గ్రామాల్లో ఆలయాలు నిర్మాణం కోసం ఎంతో కాలంగా ముందుకు వచ్చి తమ వంతు విరాళాలు అందజేయడం జరిగిందన్నారు.

## ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోతే రద్దు చేయడానికి వెనుకాడబోము

**– మండల స్పెషలాఫీసర్ ప్రశాంత్ కుమార్**



**రామభద్రపురం, ఫిబ్రవరి 26(మేజర్ న్యూస్) :** మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని మండల స్పెషలాఫీసర్ జి.ప్రశాంత్ కుమార్ కోరారు. మండల పరిధిలోని కోటశిరాంగ్రామంలో గురువారం హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ ఇళ్లు మంజూరు చేసి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఈ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వారికి పాత గ్రాంటుతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా బీసీలకు రూ.50వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.70వేల వంతున అందిస్తుందని, ఈ అవకాశాన్ని హౌసింగ్ లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోతే లబ్ధిదారులుకు నోటీసులు ఇచ్చి రద్దు చేస్తామని హెచ్చరిం చారు. మండలంలో స ఎమారు 307 ఇళ్లు అసంపూర్తిగా ఉన్నట్టు గుర్తించా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎం. రత్నం, హౌసింగ్ ఏఈ మత్స వెంకటేష్నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం



**నరసన్నపేట ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్** : సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశము ను ప్రధానోపాధ్యాయురాలు ఒకలారత్నమాల అధ్యక్షతన గురువారం నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థుల ప్రతిభను, ప్రీపబ్లిక్ మార్కులు, గ్రాండ్ టెస్ట్ మార్కులు తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థుల యొక్క ఆరోగ్య సమస్యలు తల్లిదండ్రులు గమనించాలని, వైద్యుల సంప్రదించి ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించాలని ప్రధానోపాధ్యాయురాలు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. రాత్రి సమయాలలో ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో వాళ్ళ ఇంటికి వెళ్లి విద్యార్థుల చదువును పరిశీలించడం జరుగుతుందని తెలియజేశారు. ఉపాధ్యాయులు లక్ష్మణరావు, కేశవరావు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో "సంకల్పం" అవగాహన




**నరసన్నపేట ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్** :నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నరసన్నపేట పోలీస్ శాఖ వారి సౌజన్యంతో "సంకల్పం" అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నేటి యువత మత్తు పదార్థాలకు, సైబర్ నేరాలకు, దురాలవాట్లకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండేటట్టు చేయడమే ఈ సంకల్పం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని ప్రిన్సిపల్ డాక్టర్ పి. లత అన్నారు. దేశ జనాభాలో 40% గా ఉన్న యువత, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, కొకైన్, హెరాయిన్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణ అకుంఠిత దీక్షతో లక్ష్య సాధనలో ముందుండాలని ఎస్సై బి గణేష్ విద్యార్థులకు సూచించారు. ఇటీవల జరుగుతున్న మహిళా బాలిక నేరాలు , వాటి శిక్షలు పర్యవసానాలు, భవిష్యత్తు కలిగే అవరోధాలను ఎస్ఐ వివరించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణతో పాటు నైతిక విలువలు, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను అలవర్చుకోవాలని వైస్ ప్రిన్సిపల్ శాంతి హేమ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికార సంస్థ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ యూనిట్స్, అధ్యాపక బృందం , విద్యార్థులు పాల్గొన్నారు.

## బోర్డు పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ..



**నరసన్నపేట ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్** : జిల్లా పరిషత్ బోర్డు ఉన్నత పాఠశాల, మండల పరిషత్ బోర్డు ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి ఉప్పాడ శాంతారావు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను, జి ఎఫ్ ఎల్ ఎన్ ప్రగతిని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు అందించారు. విద్యార్థుల పురోగతికి ఉపాధ్యాయులు నిరంతరము కృషి చేయాలని చెప్పారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారము విద్యార్థులకు భోజనాన్ని అందించాలని, వంట నిర్వాహణలో సూచి శుభ్రత పాటించాలని ఎంఈఓ విజ్ఞప్తి చేశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ శిక్షణలో పాల్గొన్న ఆమదాలవలస



**ఆమదాలవలస, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్**:తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం మంగళగిరిలో ఆమదాలవలస నియోజకవర్గం క్లస్టర్ ఇన్చార్జిలకు రెండు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ లు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాజీ మున్సి పల్ చైర్ పర్సన్ ప్రతినిధి, టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, నారాయణ పురం ప్రాజెక్టు చైర్మన్, పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు సనపల డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని శిక్షణలో ప్రధాన అంశంగా తెలియజేశారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి స్థానికంగా ఉన్న వనరులు ప్రభుత్వం కల్పించాల్సిన అంశాలను మీరు పార్టీ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అభివృద్ధి పథంలో నడుస్తుందని అలాగే ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని శిక్షణ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చిన విషయాన్ని క్షేత్రస్థాయిలో వివరిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు కల్పన వంటి అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేయవలసిన పరిశ్రమలపై పార్టీ కేంద్ర నాయకత్వానికి వినతి పత్రాన్ని అందించారు.

## ఆర్ఎం పి.,పిఎంపి వైద్యులుకు ప్రభుత్వగుర్తింపు కొరకు కమిటీ వేయడం హర్షనీయం.



**టెక్కలి మేజర్ న్యూస్**:26 గ్రామీణ ప్రాంతాల్లోమరియు మురికి వాడల్లో ఆర్ ఎం పి లు మరియు పిఎం పి లు గా పిలవబడే ఈ తరహా వైద్యులు కొన్ని దశాబ్దాల కాలంగా గుర్తింపు కోసం ఎదురు చూస్తున్న గ్రామీణ వైద్యులును గుర్తింపు కోసం ఒక కమిటీ వేయడం హర్షనీయమని సీనియర్ మెడికల్ ప్రాక్టీషనర్ డాక్టరేట్ అవార్డు గ్రహీత సత్తారు రాజశేఖర్ విలేకరుల సమావేశం లో తెలిపారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రిస్వర్గీయ డా వై ఎస్ రాజశేఖరరెడ్డి ఆర్ ఎం పి, పి ఎం పి లకు జి ఓ నెంబర్ 429అమలు చేసి కమ్యూనిటీ పారామెడిక్స్ గా నామకారణం చేసి జిల్లా కేంద్ర ఆసుపత్రి లో 1000గంటల ట్రయినింగ్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగిందని దీనిలో పూర్తి స్థాయిలో ట్రయినింగ్ అయినవారు ఉన్నారని వై ఎస్ మరణం తరువాత ఆ ట్రయినింగ్ మధ్యలో ఆగిపోయిందని 2014లో టీడీపి ప్రభుత్వం ఏర్పడి ఈ ఆర్ ఎం పి, పి ఎం పి లకు 465జి ఓ అమలు అయినా ఆ జి ఓ కార్యరూపం దాల్చలేదని అన్నారు. మాజీ ఎం ఎల్సీ టీడీ జనార్ధన్ చొరవతో ఈ ఆర్ ఎం పి, పి ఎం పిల రాష్ట్రం లో అన్ని సంఘాలును ఒకే తాటి పైకి తెచ్చిఏపిఆర్ జె ఏ సి గా ఏర్పాటు చేసి గ్రామీణ వైద్యుల గుర్తింపు కొరకు దప దపాలుగా ప్రభుత్వం తో చర్చలు జరిపి మొదటి దశలో ఒక కమిటీ వేయడం హర్షనీయమని అన్నారు. ఇంకా కొన్ని గుర్తింపు పొందిన సంఘాలు బయట ఉన్నాయని ఆ సంఘాల ను కూడా కలుపు కొని వెళ్లాలని అన్నారు.ఈసందర్భంగాఏ పి ఆర్ జేఏసీ గౌరవ అధ్యక్షులు టీడీ జనార్ధన్ కి జేఏసీ జాతీయ అధ్యక్షులు డా కె జి గోవింద రెడ్డికి మరియు జేఏసీ సలహా దారు లంకదాసరి ప్రసారావు కి డా.ఎన్ ఎల్.రావు కి మరియు జేఏసీ నాయకులుకు కృతజ్ఞతలు తెలిపారు.

## డయేరియా బాధితులకు ప్రభుత్వం అండ.



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్:** డయేరియా బాధితులకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. గురువారం ఆయన డయేరియా ప్రభావిత ప్రాంతాలను, అలాగే రిమ్స్ ఆసుపత్రి శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఈ పర్యటనలో గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు పాల్గొన్నారు.ముందుగా కంద్రవీధిలో డయేరియాతో మృతి చెందిన మండల సురేష్ కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి, అనారోగ్యానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, "డయేరియా ఘటనలు బాధాకరం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బాధితులకు అవసరమైన అన్ని విధాల సహాయం అందేలా చర్యలు తీసుకుంటాం," అని భరోసా ఇచ్చారు.అనంతరం కంద్రవీధి, గోల్కొండరేవు, రామ్‌నగర్, మంగువారితోట, దమ్మలవీధి తదితర ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మంచినీటి బాటిల్ కిట్లను అందజేశారు. అలాగే జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 14 మంది రోగులను పరామర్శించి, అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ, "డయేరియా వ్యాప్తిని పూర్తిగా నియంత్రించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుంది," అని తెలిపారు.ఈ పర్యటనలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె. అనిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎల్. ప్రసన్న కుమార్, రిమ్స్ ప్రిన్సిపల్ ఎస్. అప్పలనాయుడు, ఆర్ఎంఓ సుభాషిని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్టలో ధర్మాన



**ఎచ్చర్ల ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్**:ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామం లో ముద్దాడ సర్పంచ్ ముద్దాడ లక్ష్మి శంకర్ కుటుంబం చే నిర్మింపబడిన శ్రీ శ్రీ శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం మరియు స్వామి వారి విగ్రహ ప్రారంభం కార్యక్రమం లో శ్రీకాకుళం జిల్లా వైసీపీ అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్, ఎచ్చెర్ల నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు వైసీపీ ఇంచార్జ్ గొర్లె కిరణ్ కుమార్ పాల్గొని స్వామి వారి దివ్య దర్శనం చేసుకొని వేదపండితుల ఆశీస్సులు తీసుకున్నారు ఈ కార్యక్రమం లో జిల్లా వైసీపీ జనరల్ సెక్రటరీ సనపల నారాయణ రావు, రాష్ట్ర వైసీపీ బీసీ విభాగం జనరల్ సెక్రటరీ జరుగుళ్ల శంకర్, జిల్లా వైసీపీ పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షులు నేతింటి నీలం అప్పడు,బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్క కృష్ణ మూర్తి, ముద్దాడ సర్పంచ్ ముద్దాడ శంకర్ వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# వ్యవసాయ రంగం బలోపేతానికి ప్రత్యేక కృషి

**- రైతన్నలకు అండగా వ్యవసాయ శాఖ మంత్రి - మార్కెట్ యార్డ్ కి రూ.3.20 కోట్ల మంజూరు - అభివృద్ధికి చిరునామాగా... వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు - రైతులు తరపున ప్రత్యేక అభినందనలు తెలిపిన ఏఎంసి డైరెక్టర్ జర్జాన రాంజీ**

**టెక్కలి మేజర్ న్యూస్:26 కోటబొమ్మాలి** మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి మహర్దశ కలుగుతూ తమ రూపురేఖలు మార్చాలని ఉద్దేశముతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషితో దీన్ని అభివృద్ధికి రూ. 3.20 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గొప్ప విషయమని, వ్యవసాయ రంగం బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్న మంత్రికి రైతన్నల తరపున ప్రత్యేక ధన్యవాదాలు కోటబొమ్మాలి ఏఎంసీ డైరెక్టర్ జర్జాన రాంజీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతన్నలకు అండగా అనుక్షణం తమ సేవలు అందిస్తూ రైతన్నల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఆనాటి కేంద్ర మాజీ మంత్రి దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు కాలం నుంచి చీపుర్లపాడు వద్ద కూరగాయల మార్కెట్ అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి జరిగిన ఫలితం లేకపోయింది. అయినా ఆయన కల నెరవేరాలని ఉద్దేశంతో నేటికీ ఆయన సోదరుడు కింజరాపు అచ్చెన్నాయుడు నెరవేర్చారని కొనియాడారు. మార్కెట్ యార్డ్ నిర్మాణానికి 90 లక్షల మంజూరు చేయడం వలన ఆ చుట్టుపక్కల రైతులకు మౌలిక వసతులు, రైతందానికి ఎంతో మేలు చేయడమే చెప్పుకోవచ్చు అని అన్నారు. చాంబర్ కమిటీ హాల్ నిర్మాణానికి 55 లక్షలు, లహరి రక్షణ గోడ నిర్మాణం,



రక్షణ గేట్లు ఏర్పాటుకు కోటిన్నర రూపాయలు కేటాయించి రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందాలని ఉద్దేశంతో ఏ నిధులు మంజూరు చేయడం పట్ల ఆనందాన్ని వ్యక్తపరిచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలి నియోజకవర్గాన్ని ఒక బాధ్యతగా తీసుకొని ప్రతి గ్రామాన్ని అందంగా, సుందరంగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో అనుక్షణం కృషి చేస్తున్న మంత్రికి కోటబొమ్మాలి మార్కెటింగ్ యాడ్ కమిటీ సభ్యులు తరపున మరియు రైతన్నల తరపున బిజెపి మండల అధ్యక్షులు మరియు ఏఎంసీ డైరెక్టర్ జర్జాన రాంజీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# స్వయం ఉపాధితోనే ఆర్థిక పురోగతి




**ఎచ్చెర్ల, ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్** : నిరుద్యోగులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని సొంతంగా ఎదిగేందుకు కృషి చేయాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పెడాడ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం లబ్ధిదారులకు గురువారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 5 లక్షల లోపు రుణాలు పొందిన వారికి ఐదు రోజులు, అంతకంటే ఎక్కువ రుణం తీసుకున్న వారికి పది రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ పూర్తయ్యాక ఇచ్చే ధృవీకరణ పత్రాలను సంబంధిత బ్యాంకుల్లో సమర్పించాల్సి ఉంటుందని, ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే తదుపరి విడతలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.మహిళా దినోత్సవం నాటికి యూనిట్ల స్థాపనమహిళా లబ్ధిదారులందరూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తమ ఉపాధి యూనిట్లను ప్రారంభించి ఆదర్శంగా నిలవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ ఆకాంక్షించారు. మార్చి 8వ తేదీ లోపు లబ్ధిదారులందరూ తమ యూనిట్లను గ్రౌండింగ్ చేసి సిద్ధం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో రెండో విడతగా ఈ శిక్షణ జరుగుతోందని సంస్థ డైరెక్టర్ రాంజీ తెలపగా, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్ కృష్ణ మాట్లాడుతూ.. లబ్ధిదారులు వ్యాపార మెళకువలు నేర్చుకుని అభ్యున్నతి సాధించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు, శిక్షకులు పాల్గొన్నారు.

# కొత్తూరు మండల రాజకీయాల్లో "జనసేన తుఫాన్ "

**- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యం లో వేగంగా మారుతున్న పరిణామాలు**

**కొత్తూరు ఫిబ్రవరి 26(మేజర్ న్యూస్ )** పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండల రాజకీయాల్లో జనసేన పార్టీ తుఫాన్ సృష్టించ నున్నట్లు సమాచారం. ఇంతవరకు మండలంలో ఎటువంటి జవసత్వాలులేని జనసేన పటిష్టత కోసం చర్యలు చేపట్టింది.ఇందులో భాగం గా నియోజకవర్గం లో రాజకీయంగా సభ్యత్వ నమోదుకు అత్యంత రాజకీయ ప్రాధాన్యత గల కొత్తూరు మండలం నుండే ప్రారంభించాలని నిర్ణయించింది. సుడా చైర్మన్ కోరికాన రవికుమార్ ఆయన సతీమణి పాతపట్నం నియోజకవర్గం ఇన్ చార్జ్ కోరికాన భవాని శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు మండల కేంద్రమైన కొత్తూరు లో ఒక ప్రైవేట్ కల్యాణ మండపం లో మండల పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వైసీపీ నేత ఇంటికి కోరికాన దంపతులు వెళ్లి పార్టీలోనికి ఆహ్వానించి మొదటి సభ్యత్వం నమోదు చేయాలని నిర్ణయించి నట్లు విశ్వాసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మండలం లో నలుగురు సర్పంచ్ లు , ఒక యంపిటిసి శుక్రవారం జనసేన లో చేరనున్నట్లు సమాచారం. ఇటీవల వీరందరు తెలుగు దేశంలో చేరాలని నిర్ణయించగా మండల తెలుగు దేశం పార్టీ లో తలెత్తిన పరిణామాలు వలన వీరు చేరికకు బ్రేక్ పడింది. జనసేన లో చేరాలని నిర్ణయించిన వారందరు వైసీపీ కి చెందిన వారు కావడం గమనార్హం.సుడా చైర్మన్ కోరికాన రవికుమార్ దంపతులు సభ్యత్వ నమోదు కొత్తూరు మండలం తో శ్రీకారం చుట్టడం, పాతపట్నం ఇంచార్జి గా సభ్యత్వ నమోదు కు కొత్తూరు మండలం నుండే ప్రారంభించడం వలన పార్టీ బలపడే అవకాశలు ఎక్కువ గా ఉండవచ్చునని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నట్లు సమాచారం.

# ఎంపిడిఓ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.



**- పీఆర్ కమిషనర్‌ను కోరిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష.**
**- వజ్రపుకొత్తూరు ఎంపీడీవో కార్యాలయానికి నిధుల హామీ.**
**- పెండింగ్ బిల్లులు త్వరలో విడుదల - పీఆర్ కమిషనర్ సానుకూల స్పందన.**

**పలాస, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్:**పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష అమరావతిలో పంచాయతీరాజ్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలసి,నియోజకవర్గానికి సంబంధించిన కీలక అభివృద్ధి అంశాలపై విజ్ఞప్తి చేశారు.ముఖ్యంగా వజ్రపుకొత్తూరు మండలంలో అసంపూర్తిగా ఉన్న ఎంపీడీవో కార్యాలయ భవనం నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయించేందుకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరారు.ఈ సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ,ఎంపీడీవో కార్యాలయ భవనం పూర్తి నిర్మాణానికి కావలసిన నిధులు 10 నుండి 15 రోజుల్లో మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే శిరీష తెలిపారు.భవనం పూర్తయితే తద్వారా మండల స్థాయి పాలన మరింత సమర్థవంతంగా అందుబాటులోకి వస్తాయని ఆమె వివరించారు.ఇదే సందర్భంగా గతంలో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల అంశాన్ని కూడా ఎమ్మెల్యే కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.ఈ బిల్లులు త్వరగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరగా కమీషనర్ స్పందించి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ (ఎంజిఎన్ ఆర్ ఈజిఎస్) నిధుల ద్వారా త్వరలోనే మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే శిరీష పేర్కొన్నారు.నియోజకవర్గ అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తవ్వడమే కాకుండా,పనులు చేపట్టే కాంట్రాక్టర్లు కూడా చెల్లింపుల ఆలస్యంతో ఇబ్బంది పడకుండా ఉండేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే శిరీష తెలిపారు.ప్రజాధనం సద్వినియోగం అయ్యేలా, పనులు వేగంగా పూర్తి అయ్యేలా నిరంతర పర్యవేక్షణ చేస్తామని ఎమ్మెల్యే శిరీష స్పష్టం చేసారు.

# పలాస ప్రజారోగ్యానికి ఎమ్మెల్యే శిరీష భరోసా!

**- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కు వివరించిన సమస్య తీవ్రత.**
**- డ్రైనేజీ వ్యవస్థకు మహర్దశ పట్టిస్తూ సుడా ద్వారా రూ 5 కోట్ల నిధులు మంజూరు.**

**పలాస, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్:**పలాస నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం మరియు శ్రేయస్సే తన లక్ష్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష మరోసారి నిరూపించారు.దశాబ్దాలుగా పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల ప్రజలను వేధిస్తున్న మురుగు కాలువల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఆమె చేసిన అవిశ్రాంత పోరాటం ఫలించింది.పట్టణ డ్రైనేజీ వ్యవస్థ సమూల ప్రక్షాళనకు ఏకంగా 5 కోట్ల రూపాయల నిధులను సాధించి, ప్రజారోగ్యంపై తనకున్న అపారమైన బాధ్యతను చాటుకున్నారు.గత కొంతకాలంగా, మురుగునీరు రోడ్లపైకి చేరడం,దుర్గంధం, దోమల బెడదతో స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూసిన శిరీష ఈ సమస్యను తన భుజాలపై వేసుకున్నారు. శాసనసభ సమావేశాల్లో పలాస ప్రజల గొంతుకై గళమెత్తారు.సంబంధిత మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ కు సమస్య తీవ్రతను వివరించి,తక్షణమే నిధులు మంజూరు చేయాలని గట్టిగా పట్టుబట్టారు.ఆమె పోరాట పటిమకు స్పందించిన ప్రభుత్వం, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకు సూడా నిధుల నుండి 5 కోట్ల రూపాయలు ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ నిధులతో అధునాతన డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం జరగనుండటంతో,పట్టణ ప్రజల ఆరోగ్యానికి పెను ముప్పుగా మారిన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.కేవలం



మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధిని చూపిస్తూ,ప్రజా సంక్షేమం పట్ల తనకున్న చిత్తశుద్ధిని ఎమ్మెల్యే శిరీష నిరూపించుకున్నారని నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇచ్చిన మాట కోసం నిరంతరం పోరాడి,ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసిన ఆమె నాయకత్వం పలాస అభివృద్ధికి శ్రీరామరక్ష అని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఈ భారీ నిధుల మంజూరుతో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ రూపురేఖలు మారనున్నాయని,పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొననుందని స్పష్టమవుతోంది.

# సూర్య కథనానికి స్పందన


పారిశుధ్యంపై అధికారుల నిర్లక్ష్యం

**- ఎంపిడిఓ చొరవతో కదిలిన యంత్రాంగం**

**- యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు**

**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్:** మండలంలోని చిన్నసాన పరిశుద్యంపై గురువారం సూర్య పత్రికలో వెలువడిన కథనానికి స్పందించిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. ఫణీంద్ర కుమార్ హుటాహుటిన పాఠశాల సమీపంలో డ్రైనేజీలో పూడికను తొలగించి, శానిటైసేషన్ చేయించారు. జిల్లా కేంద్రంలో డయేరియా కేసులు నమోదు అవ్వడంతో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు నిర్వహించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ



**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్:**వారంతా 1968 సంవత్సరంలో ఎస్ ఎస్ ఎల్ సి చదువుకున్న తోటి విద్యార్థులు. నేడు వివిధ ఉద్యోగ హోదాల్లో పనిచేసి విశ్రాంత ఉద్యోగులుగా గడుపుతున్నారు. అయితే తాము చదువుకున్న కోటబొమ్మాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గురువారం కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు, అనుభవాలను నెమరు వేసుకున్నారు. సుమారు 75 ఏళ్ల వయసులో తాము చదువుకున్న పాఠశాలను సందర్శించి పాఠశాల పరిస్థితిని పరిశీలించి వెళదామని అందుబాటులో ఉన్న కొందరు చేరుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి 2 డి. గోవిందరావు తో కలిసి సమావేశమయ్యారు. ఆనాటి తో పోల్చుకుంటే పాఠశాల స్వరూపమే మారిపోయిందని, ఆహ్లాదకర వాతావరణంలో అభివృద్ధి పదంలో నడుస్తుందని వారు సంతోషించారు. త్వరలో తమతోటి పూర?వ విద్యార్థుల కుటుంబాలతో కలిసి పాఠశాలలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని వారు తెలియజేశారు. సమావేశంలో పాల్గొన్న వారిలో మెక్సికోలోని ఆర లసోర్ మిట?టల్ కంపెనీలో ఐటి కమ్యూనికేషన్స్ డైరెక్టర్ గా పనిచేసి పదవి విరమణ చేసిన పీవీవీఎస్ శర?మ, వి. ప్రభాకర్ రావు, (విశ్రాంత జిసిసి చీఫ్ అకౌంటెంట్, ఒడిశా), కె ఎస్ ఆర్ రెడ్డి, (బారువ డిగ్రీ కళాశాల విశ్రాంత ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్), ఎన్. రామారావు, (విశ్రాంత సబ్ ఇన్స్పెక్టర్), యు. చిన్నప్పలనాయుడు, (విశ్రాంత ప్రధానోపాధ్యాయులు), టి. సూరిబాబు, (సీనియర్ మెకానికల్ ఇంజనీర్) ఉన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు గాయాలు

**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్:** మేజరు పంచాయతీ నివాసముంటున్న తంగుడు అరుణకుమారి గురువారం ఇంటిముందు కల్లాపు వేస్తున్న సమయంతో వెనుక నుంచి ద్విచక్ర వాహనదారులు ఢీ కొనడంతో అమె కాలు విరగడంతో వెంటనే శ్రీకాకుళం ఓ ప్రైవేటు అసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్ఐ వి. సత్యన్నారాయణ తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న 6 గేదెలు పట్టివేత

**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ :** అక్రమంగా లారీలో తరలిస్తున్న 6 గేదెలను గట్లపాడు జాతీయ రహదారి జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం స్థానిక ఎస్ఐ వి. సత్యన్నారాయణ తన సిబ్బందితో పట్టుకొన్నారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు కంచిలి నుంచి అలమండకు అక్రమంగా లారీలో గేదెలను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గట్లపాడు వద్ద తనిఖీలు నిర్వహించి పట్టుకున్నామని ఆయన తెలిపారు. పట్టుకున్న గేదెలను సింహాచలం గోశాలకు తరలించి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో సుధస వ్రతము



**మెలియాపుట్టి. ఫిబ్రవరి 26. మేజర్ న్యూస్:**మెలియాపుట్టి శ్రీ రాధాగోవిందస్వామి ఆలయంలో మహా సుధస వ్రతం,లక్ష్మీదేవి పూజలు భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకులు గోపీనాథ్ రథో,సన్నారతో ఆధ్వర్యంలో గురువారం పూజలు నిర్వహించారు. మహిళలు లక్ష్మీదేవికి పసుపు కుంకాలతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ వ్రతము వస్తాది అయితే సుదస వ్రతము ప్రత్యేకత పాల్గుణ మాసం, శు క్లపక్షం, మృగశిర నక్షత్రం, గురువారం రోజున సుధస వ్రతం మహిళలు భక్తిశ్రద్ధలతో చేస్తారు .14 సంవత్సరాల ఒకసారి ఈ సుధస వ్రతము వస్తుందని, ఈ వ్రతము యొక్క విశిష్టత పూజ చేసిన వారికి కలిగే ఫలము తదితర వివరాలను అర్చకులు వివరించారు. లక్ష్మీదేవి పూజ అష్టోత్తరం, సుదస వ్రత కథ భక్తులకు చదివి వినిపించారు.లక్ష్మీనారాయణ పూజ (సుధస వ్రతం) కొత్తగా పెళ్లయిన మహిళలు ఈ వ్రతము మొదలు పెట్టడానికి మంచి రోజు. ఈ వ్రతము ప్రారంభించిన మహిళలు నియమాలు పాటిస్తూ విధిగా ఆయా రోజుల లో వచ్చే వ్రతం చేయాలి. ఇలా భక్తిశ్రద్ధలతో సుదస వ్రతము చేస్తే ఆయా కుటుంబాలకు లక్ష్మీదేవి కటాక్షం సమృద్ధిగా ఉంటుందని అర్చకులు తెలిపారు. దీనితో గ్రామములో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. వందలాదిమంది మహిళలు ఈ పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు.పూజ అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు చేశారు.

## ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరా



**మెలియాపుట్టి. ఫిబ్రవరి 26. మేజర్ న్యూస్:**మెలియాపుట్టి మండలంలోని జలక లింగపురం గ్రామములో గత పది రోజుల నుండి కుళాయిలు మరమతులకు గురి కావడంతో గ్రామస్తులు త్రాగునీటికి ఇబ్బందులు పడ్డారు. గురువారం పాతపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ కొరికాన భవాని ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే ట్యాంకర్ ద్వారా గ్రామస్తులకు త్రాగునీరు సరఫరా చేశారు. త్రాగునీరు సరఫరా చేయడంతో గ్రామస్తులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు, రానా జనార్ధన రావు, పత్రి మణికంఠ ,నడిమింటి రఘు, తదితరులు పాల్గొన్నారు.

## రమాసత్యాన్నారాయణ పాంచాహ్నిక వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఆమదాలవలస



**ఆమదాలవలస, పిబ్రవరి26, మేజర్ న్యూస్ :** ఆమదాలవలసలో ఉన్న శ్రీరమాసత్యాన్నారాయణ స్వామి పాంచాహ్నిక వార్షిక కళ్యాణ మహోత్సవం వేడుకలు భక్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణ స్వామి ఆలయంలో రమా సత్యనారాయణ స్వామి వారి పంచాహ్నిక వార్షిక కళ్యాణ మహోత్సవం వేడుకలలో భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమదాలవలసకు చెందిన బృందంచే అన్నమయ్య సంకీర్తనలు నిర్వహించారు . ఈ పూజ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కామేశ్వరరావు, నిర్వాహక పూజా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కళాకారులకు ఆత్మీయ సత్కారం నిర్వాహక కమిటీ సభ్యులు నిర్వహించారు.

## తూటిపాల సర్పానది వద్ద ఇసుక తవ్వకాలను అడ్డుకున్న తహశీల్దార్



**మాకవరపాలెం, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్:** మాకవరపాలెం మండలం తూటిపాలలో ఇసుక తవ్వకాలను తహశీల్దార్ వెంకటరమణ గురువారం అడ్డుకున్నారు. ఈ గ్రామ శివారున ఉన్న సర్పానది నుంచి ఇసుక తరలింపునకు ఏర్పాట్లు జరుగుతున్నాయని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి తహశీల్దార్ అక్కడకు చేరుకొని ఇసుక తవ్వుతున్న ఒక జేసీబీని స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన పంచాయతీరాజ్



**మాకవరపాలెం ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్:**నర్సీపట్నం డివిజన్లో గ్రామీణాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని పంచాయతీరాజ్ శాఖ ఈఈ శారదాదేవి తెలిపారు. గురువారం మాకవరపాలెం మండలం పైడిపాల, తామరం, జంగాలపల్లి గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడవద్దని కాంట్రాక్టర్లు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నిధులు సద్వినియోగం అయ్యేలా పారదర్శకంగా పనులు పూర్తి చేయాలన్నారు. మార్చి చివరినాటికి అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడేలా సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. రూ.50 కోట్ల నిధులతో రహదారుల నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కాలువల పునరుద్ధరణ, గ్రామ పంచాయతీ భవనాల మరమ్మతులు తదితర పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఈశ్వరరావు, జేఈ సోమశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## 28న అక్షర ఆంధ్ర ఫ్రీ ఫైనల్ ఎగ్జామ్

**- ఎంపీడీవో ఎం ఉషారాణి**

**మునగపాక ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సమావేశంలో ఎంపీడీవో ఎం ఉషారాణి మాట్లాడుతూ ఈనెల 28న నిరక్షరాశులను అక్షరాసులుగా తయారు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు అన్ని గ్రామాలలో, వెలుగు, సచివాలయ, సిబ్బందితో ఈనెల 28న అక్షరాల ఎగ్జామ్ నిర్వహిస్తున్నామని తెలిపారు, అలాగే గ్రామాలలో వీధి కుక్కల ఉత్పత్తి ఎక్కువ అవుతున్నందున, వెటర్నరీ శాఖ ఆధ్వర్యంలో తగు చర్యలు తీసుకుంటున్నామని, గృహ నిర్మాణాలు, పూర్తి చేయని లబ్ధిదారులు ఉగాది కల్లా గృహప్రవేశాలు అయ్యేలాగా చర్యలు తీసుకోవాలని, ఎనర్జీ ఎస్, సిసి రోడ్లు, ఈ నెల ఆఖరులోపున, పండింగ్ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని, అన్నారు, అలాగే ప్రభుత్వం ఉద్దేశించిన ప్రతి ఇంటింటే గృహ సర్వే పూర్తిచేయాలని అధికారులను ఎంపీడీవో ఎం ఉషారాణి కోరారు, ఈ కార్యక్రమంలో జేఈ ఎంఎన్ గులాం, హౌసింగ్ ఏఈ కె మురళి, పిహెచ్ డాక్టర్ ఎన్ విమలగిరి, ఆర్డబ్ల్యూసీ ఏఈ మానస, తదితరులు పాల్గొన్నారు

## ఇంటి పన్నులు వసూళ్లకై మొబైల్ వాన్



**మునగపాక ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్** :మండల కేంద్రమైన మునగపాకలో ఇంటి పన్నులు వసూలకై మొబైల్ వ్యాను అందుబాటులోకి ఉన్నదని ఎంపీడీవో ఎం ఉషారాణి, ఈఓఆర్డి ఎం సోమరాజు తెలిపారు, ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి పన్ను కట్టడానికి పంచాయతీ కార్యాలయానికి వెళ్ళకుండా మొబైల్ వ్యాన్ దగ్గరికి వెళ్లి ఇంటి పన్ను కట్టి రసీదు పొందవచ్చునని అన్నారు, ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 లోగా ఇంటి పనులు పూర్తి చేయాలని తెలిపారు, మొబైల్ హౌస్ టాక్స్ కలెక్షన్ సెంటర్ గా దీనిని రూపొందించామని ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు

# యువత రాజకీయాల్లోకి రావాలి.. మాతృభాషను మరువొద్దు స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్:**చట్టసభల పనితీరు, ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే దిశగా కొనసాగుతున్న ఏపీ అసెంబ్లీ విజ్ఞాన యాత్రలో భాగంగా గురువారం 495 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించారు. గత పది రోజులుగా ఉత్సాహంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 107 పాఠశాలలకు చెందిన 3,718 మంది విద్యార్థులు అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. చిన్న వయసులోనే సభా కార్యక్రమాలను చూసే అవకాశం దక్కడం పట్ల విద్యార్థులు అమితానందం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా నర్సీపట్నం రిషి వ్యాలీ స్కూల్‌కు చెందిన 120 మంది విద్యార్థులు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని ప్రత్యేకంగా కలిశారు. సభా విరామ సమయంలో వారితో ఆత్మీయంగా ముచ్చటించిన స్పీకర్.. విద్యార్థులు అడిగిన పలు ఆసక్తికరమైన సందేహాలను ఓపికగా నివృత్తి చేశారు. అసెంబ్లీని సందర్శించిన ఈ విద్యార్థులందరికీ త్వరలోనే రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును సైతం చూసే అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. యువత కేవలం చదువు, ఉద్యోగాలు, కుటుంబం వరకే పరిమితం కాకుండా.. సమాజానికి మెరుగైన సేవలు అందించేందుకు రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో మాతృభాష ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. ఇళ్లలో ఆంగ్లం కాకుండా తెలుగులోనే మాట్లాడాలని, 'మమ్మీ, డాడీ' అనడానికి బదులుగా మన సంస్కృతి ఉట్టిపడేలా 'అమ్మ, నాన్న' అని ఆప్యాయంగా పిలవాలని విద్యార్థులకు సూచించారు. మన తెలుగు భాషను, మూలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోకూడదని ఆయన హితబోధ చేశారు. నర్సీపట్నం రుషి వ్యాలీ స్కూల్ డైరెక్టర్స్ అంకంరెడ్డి కార్తికేయ. అంకంరెడ్డి కౌశిక్ పాల్గొన్నారు

## గొర్ల ధర్మవరంలో నర్మలమ్మ తల్లిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



**అచ్చుతాపురం ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్:** మండలంలో జి ధర్మవరంగ్రామంలో వెలిసియున్న శ్రీశ్రీశ్రీ నర్మలమ్మ తల్లి పండుగ సందర్భంగా ఎలమంచిలి నియోజకవర్గం వైఎస్ఆర్ పార్టీ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కర్ణం ధర్మ శ్రీ గురువారం అమ్మవారు ఆశీస్సులు పొందారు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో బొడ్డేడ ప్రసాద్ గ్రామ సర్పంచ్ అశ్విని నూకరాజు మాజీ సర్పంచ్ గొర్ల రామ్ జోగి ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వం హయాంలోని గ్రామీణ రహదారులకు మహర్దశ



**అచ్చుతాపురం ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్:**అచ్చుతా పురం మండలంలో మోసయ్య పేట పంచాయితీ లో సీసీ రోడ్లకు కూటమి నాయకులు ఆదేశాలుతో మోసయ్యాపేట పంచాయతీలో సుమారు పది లక్షల రూపాయలు నిధులతో సిమెంట్ రోడ్డు అని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుర్రె శ్రీనివాసరావు, కర్రి వెంకట రమణ, ధరిమిరెడ్డి రఘు,చొప్ప రమణ, ఎల్లపు వెంకటరావు, ఒడిసెల రాజేష,పంచదారల దేవుడు, శెట్టి కొండుడు, పంచదారల దేవుడు కొండ ప్రెసిడెంట్, పంచదార రాంబాబు, పంచదారల రవణ అప్పారావు, పంచదారల రమణ, శెట్టి చిన్నోడు, శెట్టి రాంబాబు, జెడ్ పీహెచ్ స్కూల్ చైర్మన్ చట్టి తాతారావు, కిల్లాడి చిన్న, గోలగానీ శివాజీ, పుర్రె రాజు,శెట్టి మహాలక్ష్మి నాయుడు, దలీబోయినఅప్పారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## భోగాపురంలో లాలం వారు వీధికి వెళ్లే మార్గంలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన కూటమి నాయకులు



**అచ్చుతాపురం ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్:**యలమంచిలి నియోజకవర్గం శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆశీస్సులు మరియు తెలుగు దేశం పార్టీ ఇంచార్జి మరియు రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ ప్రగడ నాగేశ్వరావు ఆదేశాలు తో అచ్చుతాపురం మండలం భోగాపురం పంచాయతీ లో లాలం వారి వీధికి వెళ్ళు మార్గం లో గ్రామ పార్టీ అధ్యక్షులు దర్మిరెడ్డి నాయుడు బాబు ఆధ్వర్యంలో ఇంకా కొన్ని రోడ్లకు సుమారు 15 లక్షలు రూపాయలు నిధులు తో సిమెంట్ రోడ్డు పని ప్రారంభించడంజరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కూండ్రపు వెంకట్రావు ,కూండ్రపు అప్పారావు (వార్డు మెంబర్), రాజాన అప్పలనాయుడు, లాలం ప్రసాద్, కూండ్రపు శ్రీను, కొల్లి సన్యాసిరావు, కొల్లి అప్పలనాయుడు, లాలం రమణ,రుత్తల రమణ, పైల సర్వేశ్వరరావు, లాలం శ్రీను బాబు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా గొర్లె ధర్మవరం గ్రామంలో నల్లమారమ్మ పండగ మహోత్సవాలు ఎడ్లబండ్ల పోటీలు



**అచ్చుతాపురం ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్:**అచ్చుతాపురం మండలం గొర్లె ధర్మవరం గ్రామంలో గురువారం నల్లమారమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.



ఈ సందర్భంగా మధ్యాహ్నం ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలు: మొదటి బహుమతి అంకుపాలెం శ్రీ ఆంజనేయ టీమ్ ద్వితీయ బహుమతి చోడవరం ఆదిరెడ్డి రాముతృతీయ బహుమతి సింహాద్రిపురం అభయ ఆంజనేయ టీమ్ నాల్గవ బహుమతి నర్సయ్యపేట ముమ్మన రాము ఐదవ బహుమతి కుంద్రం మరిడిమాంబ టీమ్ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశ్విని నూకరాజు, మాజీ సర్పంచ్ గొర్లె రామజోగి, గొర్లె రమణ, గొర్లె నర్సింగరావు, నానేపల్లి సన్యాసి నాయుడు, మడక కృష్ణమూర్తి, గొర్లె వెంకట కృష్ణ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల నుండి తీన్మార్ డప్పులుతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించి, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## 27న మారేపల్లి వెంకటేశ్వరస్వామి కళ్యాణం



**దేవరాపల్లి, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ :** మండలంలోని మారేపల్లి పాండవుల కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఈనెల 27న శుక్రవారం ఏకాదశి నాడు ఈ కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ కళ్యాణం సందర్భంగా అదేరోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కళ్యాణ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వారు ఆకాంక్షించారు.

## 28న పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**దేవరాపల్లి, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్** :మండలంలోని బోయిలకింతాడ సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 28 శనివారం విద్యుత్తు కు అంతరాయం కలగనిందని దేవరాపల్లి ఎలక్ట్రికల్ ఏఈ కర్రి శంకరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సబ్ స్టేషన్ లో పెయింటింగ్ వెయిటకు గాను ఆరోజు ఈ సబ్ స్టేషన్ పరిధిలో గల ములకలాపల్లి, వేచలం, బోయిలకింతాడ, గవరవరం, జగన్నాథపురం, ఎం. అలమండ గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు కు అంతరాయం కలుగుతుందని ఈ సందర్భంగా ఏఈ తెలియజేశారు.

## స్మశాన వాటిక అభివృద్ధికి ఆర్థిక సాయం



**దేవరాపల్లి, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్** :మండలంలోని ముషిడిపల్లి స్మశాన వాటికలో బొడ్డు శివ భాస్కర్ రావు జ్ఞాపకార్థం బొడ్డు సత్యం, రామలక్ష్మి దంపతులు సుమారు రూ.2 లక్షల 50 వేల రూపాయలతో వెయిటింగ్ హాల్ నిర్మాణ పనులు చేపట్టారు. గురువారం ఈ వెయిటింగ్ హాల్ ను గ్రామ ప్రజలకు అంకితం చేశారు. స్మశాన వాటికలో వెయిటింగ్ హాలు లేక గతంలో చాలా అవస్థలు పడ్డామని స్థానిక ప్రజలు ఈ వెయిటింగ్ హాల్ నిర్మాణ దాత దంపతులను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి నాయకులు లెక్కల తాతంనాయుడు, బొడ్డు నారాయణమూర్తి, గ్రామ పెద్దలు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 26/02/2026

# నేటి నుండి జనసేన ఉద్యమి

## సభ్యత్వ నమోదు ఉత్సవాలు



**మునగపాక ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన మునగపాక జనసేన పార్టీ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జనసేన పార్టీ కన్వీనర్ సుందరపు వెంకట సతీష్ కుమార్ శుక్రవారం సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రారంభమైన జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం జనసేన పార్టీ లో సభ్యత్వం తీసుకోవడం అంటే సమాజంలో మంచి వైపు నిలబడతారనే గౌరవాన్ని సంపాదించడంవ్యవస్థలో మార్పు కోసం ఉద్యమించే వారే జనసేన ఉద్యమి,సాధారణ కార్యకర్త నుండి నాయకులు అయ్యే అవకాశం కల్పన ఈ సభ్యత్వంతో సాధ్యం,రాజకీయ, సామాజిక అంశాలపై శిక్షణ పొందే అవకాశాలు,సభ్యత్వం ఉన్నవారికే పార్టీ కమిటీల్లో అవకాశం,మీ కుటుంబానికి భరోసా కల్పించేలా ప్రతీ ఉద్యమికి ?5 లక్షల ప్రమాద జీవిత బీమా,ఇప్పుడే సభ్యత్వం కోసం మీ స్థానిక జనసేన సాధక్ ను మండలంలో ఉన్న గ్రామంలో ఉన్న జనసైనికులు అందరూ సభ్యత్వ నమోదు పూర్తి చెయ్యాలన్నారు, ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు టెక్కలి పరుశురాం, ఏవి సత్యనారాయణ, పాలిపిని సత్యనారాయణ, కొయిలాడ దశావతారం, ఆడారి గోవిందరావు,కాండ్రేగుల గాంధీ, ఎల్లపు భాస్కరరావు, బొడ్డేడ అప్పలనాయుడు, మొల్లేటి ఆనంద్, ఆడారి శ్రీకాంత్, ఆడారి గణేష్, మొల్లేటి బోగేష్, వీర మహిళలు సరోజినీ, సరస్వతి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

## నరేంద్రపురంలో రైతులకు అవగాహన సదస్సు



**మునగపాక ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్** :మండలంలో నరేంద్రపురం గ్రామంలో ఉద్యానవన శాఖ వారు ఆధ్వర్యంలో ఉద్యాన పంటల మీద అవగాహన కొరకు నరేంద్రపురం గ్రామ రైతులతో పంటలకు ఏ ఎరువు వాడాలి ఏ మందులు కొట్టాలి జీడి మామిడి కొబ్బరి బొప్పాయి కూరగాయలు మొదలగు వాటి మీద రైతులతో హార్టికల్చర్ లావణ్య మేడం గారు సచివాలయం ఏవో తులసి మేడం వైస్ ఎంపీపీ బోజ లక్ష్మి ఉప సర్పంచ్ భోజ వెంకట శ్రీనివాసరావు గ్రామ తెలుగుదేశం అధ్యక్షులు బద్ది రామలోకేష్ మాజీ పాల సంఘం అధ్యక్షులు బోజ శ్రీనివాసరావు చందక శ్రీనివాసరావు రైతులందరూ కూడా ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు

### అత్యంత వైభవంగా శ్రీ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి విగ్రహా



పలాస,ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్.పలాస నియోజకవర్గం,మందస మండలం,చిన్న బహడపల్లి గ్రామంలో గురువారం శ్రీ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి శివాలయం లో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.వేద పండితులు బ్రహ్మశ్రీ నిరంజన్ పండా,చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్ఫటిక లింగాన్ని ప్రతిష్టించారు.వేదమంత్రాలు,మంగళ వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.యాగశాలలో లక్ష్మీ పూజ, విశేష హోమాలు,మండప దేవత పునః పూజలు,మూల మంత్ర హోమాలు, దేవమూర్తులకు విశేష స్నానాలు నిర్వహించారు.ఆలయ ప్రవేశ మోక్షద్వారం,నవగ్రహాలు స్వామి యంత్ర శిఖర కలిశా పూర్ణ బూరెలు నివేదన చేశారు.కుంభ దేనిదుష్టి దర్పణ దర్శనం, కుంభ గోవృష్ట దర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.పలాస నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త వెంకన్న చౌదరి స్ఫటిక లింగానికి అభిషేకం చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు.మాజీ మంత్రి గౌతు శివాజీ కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు పీరికట్ల విఠల్ రావు,భావన దుర్యోధన,సాలిన మాధవరావు,దట్టి.లింగరాజు,నవీన్ యాదవ్ తో పాటు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించి శాంతి హోమంలో పాల్గొన్నారు. మఅనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమం లో గ్రామ యువత,అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### జానికిరామపురం గ్రామంలో ఘనంగా శ్రీ శ్రీ శ్రీ తలుపులమ్మ తల్లి

## అమ్మవారి ఆలయ ప్రారంభం



**గొలుగొండ పిబ్రవరి 26 మేజర్ న్యుస్:** గొలుగొండ మండలం జానికిరామపురం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ తలుపులమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద మంత్రోచ్చారణల మధ్య



ఆలయ ప్రాంగణం భక్తి పరవశంతో మార్మోగింది. మహిళలు కోలాటం ఆడి భక్తి భావాన్ని వ్యక్తపరిచారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్న సతీమణి పద్మావతి,గ్రామ పెద్దలు, పప్పుశెట్టిపాలెం ఉపసర్పంచ్ మాకిరెడ్డి వరహాలు బాబు యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలు..

# రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడల పోటీలలో

## సత్తా చాటిన రావికమతంమండలం క్రీడాకారులు




**రావికమతం ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ :** ఏడవ పారామెడికల్ రాష్ట్ర స్థాయి పోటీలలో రావికమతం మండలానికి చెందిన దివ్యాంగులు సత్తా చాటారని ఉపాధ్యాయుడు బొడ్డు మహాలక్ష్మి నాయుడు తెలిపారు. విజయనగరం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో బుధ గురువారం లలో దివ్యాంగుల రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. దీనిలో రావికమతం మండలానికి చెందిన క్రీడాకారులకు ఐదు బంగారు ఒక రజిత రెండు కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. గది ఆదది డిసెంబర్లో అనకాపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో సత్తా చూపిన క్రీడాకారులు ను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందన్నారు. వీరు రాష్ట్రస్థాయిలో జరిగిన పొడిలో పాల్గొని మండలానికి మంచి పేరు తెచ్చారని వివరించారు. వీల్ చైర్ బ్యాడ్మింటన్ పోటీల్లో గూనురు ఆదిలక్ష్మి, రౌతు తనుష్, రాజాన మానస, నమ్మి హేమదుర్గ, వెల్లంకి లోకేష్, లుకు ప్రస్తుత ఇక్కడలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మేడల్స్ గెలిచారని చెప్పారు

# ఘనంగా దుర్గ మాంబ పండగ



**పరవాడ , ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్:** మండలంలో గల పెదముషీడివాడ పంచాయతీ నక్కవానిపాలెం దుర్గమాంబ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి పసుపు కుంకుమ నైవేద్యాలతో పూజలు చేశారు.ఈ జాతరలో భాగంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించినజిల్లాస్థాయి గుర్రపు పందాలు పోటాపోటీగా జరిగాయి.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగాబలిరెడ్డి అప్పారావు జనసేన పార్టీ నాయకులు, బలిరెడ్డి అప్పారావు ( ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్) పెందుర్తి నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు. కరణం నర్సింగరావు పరవాడ మండలం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి,. అగ్రపు మల్లేశ్వరరావు జనసేన పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి గుర్రపు పందాలను ప్రారంభించారు. గెలుపొందిన విజేతలకు పరవాడ ఇన్స్పెక్టర్ ఆర్ మల్లికార్జున రావు చేతుల మీదుగా అందజేశారు. మొదటి బహుమతి పన్నెండు వేలు, రెండవ బహుమతి, తొమ్మిది వేలు, మూడో బహుమతి ఆరు వేలు నాల్గొవా బాహుమతి మూడు వేలు ఐదవ బహుమతి రెండు వేలు చొప్పున విజేతలకు బహుమతులు ఆయన అందజేశారు.ఈ కార్యక్రమంలో మడక ప్రసాద్. నారపిన్ని గణేష్. అలమండ నారాయణరావు(నరేష్) నారపిన్ని సంతోష్ నాయుడు.బలిరెడ్డి ప్రసాద్. నారపల్లి సంతోష్ కుమార్. నరపిన్ని నాగేశ్వరావు. నారపిన్ని రమణ. నారపిన్ని సంతోష్ కుమార్.నారపిన్ని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల వెల్ఫేర్ సొసైటీ కి ప్రభుత్వ స్థలం కేటాయించాలి



**అనకాపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్:** మాజీ సైనికుల వెల్ఫేర్ అసోసియేషన్ కు స్థలం కేటాయిస్తే భవనం నిర్మించి మాజీ సైనికుల సంక్షేమానికి ఉపయోగిస్తామని అంటూ నియోజకవర్గంలో గల మాజీ సైనికులు గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ సైనిక సంఘం నాయకులు మాట్లాడుతూ అనకాపల్లి నియోజకవర్గంలో దాదాపు 8000 మంది మాజీ సైనికులు ఉన్నారు. వారందరూ అనకాపల్లి సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ను స్థాపించి, ఒక ప్రైవేట్ కార్యాలయాన్ని తీసుకొని వారి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని . ప్రభుత్వం మాకు భూమిని ఇస్తే, మేము అక్కడ ఒక జిల్లా సొసైటీ భవనాన్ని నిర్మించుకుంటామని, .అక్కడ మేము యుద్ధ స్మారక చిహ్నం మరియు సొసైటీ భవనాన్ని నిర్మించి సైనిక్ కార్యక్రమాలను నిర్వహిస్తాము అని దయచేసి మాకు 10 నుండి 15 సెంట్ల భూమిని ఇప్పించవలసిందిగా వినత పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కొణతాల సానుకూలంగా స్పందించి త్వరలోనే అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

### స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలి

విశాఖపట్టణం, ఫిబ్రవరి 26 ః రాష్ట్ర ప్రభుత్వ దూరదృష్టి కార్యక్రమం “స్వర్ణాంధ్ర ఏ 2047” లక్ష్యాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ప్రజలకు విస్తృత స్థాయిలో సమాచారం చేరవేయాలనే ఉద్దేశంతో రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్ను సంబంధిత అధికారులతో కలిసి గురువారం తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ను సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లే కార్యాచరణలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు పారదర్శకత, సాంకేతిక వినియోగం, ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు, సుస్థిర వృద్ధి లక్ష్యాలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాల వివరాలతో రూపొందించిన ఈ క్యాలెండర్ జిల్లా వ్యాప్తంగా కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రతినిధులకు పంపిణీ చేయాలని

# నూతన రాజకీయ పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు

### - రిటైర్డ్ డి.ఎస్.పి.యూనివర్స్ వెల్లడి

**అరకులోయ, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్టుగా సంఘ సేవకుడు,రిటైర్డ్ డి.ఎస్.పి. యూనివర్స్ ప్రకటించారు. స్థానిక రోడ్లు భవనాలశాఖ అతిథి గృహం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైన్స్ యుగంలో నూతన రాజకీయ పార్టీ స్థాపన కోసం సన్నాహాలు చేస్తున్నామన్నారు.అందరి ఆమోదంతో సరికొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాలనే తలంపుతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్టు ఆయన తెలిపారు.నూతన రాజకీయ పార్టీ ఏర్పాటుకు సంబంధించి అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు స్వరాష్ట్రంలోనే కాకుండా దేశంలోని తొమ్మిది అంతర్ రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించినట్టు ఆయన చెప్పారు.ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన అనంతరం రాజకీయ పార్టీ ఏర్పాటుపై ప్రకటన విడుదల చేస్తామన్నారు.రాష్ట్రంలోని ప్రస్తుత పరిణామాలను దృష్టిలో పెట్టుకొని నూతన రాజకీయ పార్టీ అవసరమని గుర్తించామని, ప్రజాస్వామ్యంలో ప్రత్యామ్నాయ పార్టీ అవసరమని మేధావులు చెబుతున్నారని,ఈ నేపథ్యంలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు దిశపై దృష్టి కేంద్రీకరించినట్టు ఆయన తెలిపారు.అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు రెవెన్యూ డివిజన్, డుంబ్రిగుడ మండలానికి చెందిన సొవ్వా గ్రామ



వాస్తవ్యుడైన తాను గత 24 సంవత్సరాలుగా సమాజ సేవ చేస్తున్నానని ఆయన వివరించారు.డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తూనే సంఘ సేవ కార్యకలాపాలు చేపడుతున్నానన్నారు. ప్రస్తుత రాజకీయ పార్టీల వ్యవహారం పట్ల ప్రజలంతా అసంతృప్తితో ఉన్నారని,ఈ రాజకీయ పార్టీలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నట్టు ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, కులాలను అభివృద్ధి చేయడం కోసం మాత్రమే ఈ పార్టీలు పాటుపడుతున్నట్టు తెలుస్తుందన్నారు.ఇటువంటి పరిస్థితులు కొనసాగితే రాష్ట్రం అధోగతి పాలు కాకుండా పోదని యూనివర్స్ పేర్కొన్నారు.విలేకరుల సమావేశంలో పలు గ్రామాల ఆదివాసులు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గ మాంబ పండగ



**పరవాడ, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** మండలంలో గల పెదముషీడివాడ పంచాయతీ నక్కవానిపాలెం దుర్గమాంబ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి పసుపు కుంకుమ నైవేద్యాలతో పూజలు చేశారు.ఈ జాతరలో భాగంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి గుర్రపు పందాలు పోటాపోటీగా జరిగాయి.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బలిరెడ్డి అప్పారావు జనసేన పార్టీ నాయకులు, బలిరెడ్డి అప్పారావు ( ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్) పెందుర్తి నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు. కరణం నర్సింగరావు పరవాడ మండలం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి,. అగ్రపు మల్లేశ్వరరావు జనసేన పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి గుర్రపు పందాలను ప్రారంభించారు. గెలుపొందిన విజేతలకు పరవాడ ఇన్స్పెక్టర్ ఆర్ మల్లికార్జున రావు చేతుల మీదుగా అందజేశారు. మొదటి బహుమతి పన్నెండు వేలు, రెండవ బహుమతి, తొమ్మిది వేలు, మూడో బహుమతి ఆరు వేలు నాల్గోవా బాహుమతి మూడు వేలు ఐదవ బహుమతి రెండు వేలు చొప్పున విజేతలకు బహుమతులు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మడక ప్రసాద్. నారపిన్ని గణేష్. అలమండ నారాయణరావు(నరేష్) నారపిన్ని సంతోష్ నాయుడు.బలిరెడ్డి ప్రసాద్. నారపల్లి సంతోష్ కుమార్. నరపిన్ని నాగేశ్వరావు. నారపిన్ని రమణ. నారపిన్ని సంతోష్ కుమార్.నారపిన్ని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి..

### - సీపీ డా. శంఖబ్రత బాగ్చి - డ్రగ్స్ రహిత విశాఖ లక్ష్యంగా అవగాహన సదస్సు





**విశాఖ క్రైం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో కీలక అవగాహన సదస్సు నిర్వహించారు. విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ మరియు విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. సదస్సులో ప్రత్యక్షంగా సుమారు 200 మంది, ఆన్‌లైన్ ద్వారా 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అలవాటు వల్ల కలిగే దీర్ఘకాలిక శారీరక, మానసిక, సామాజిక నష్టాలను వివరించారు. డ్రగ్స్‌కు బానిసవడం ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా విద్య, కెరీర్, భవిష్యత్తు అవకాశాలను నాశనం చేస్తుందని హెచ్చరించారు. కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నమవడమే కాక సమాజం కూడా బలహీనపడుతుందని స్పష్టం చేశారు.

### - ప్రతి విద్యార్థి వారియర్స్‌గా మారాలి

ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా "వారియర్స్"గా మారాలని, అప్రమత్తంగా ఉండి సరైన నిర్ణయాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో పోలీసులకు యువత సహకారం అత్యవసరమని తెలిపారు. అవగాహన మరియు ముందస్తు నివారణే ఈ సమస్యను అరికట్టే ప్రధాన మార్గమని నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతానికి విసీఎస్సి సమన్వయకర్త మరియు యాంటీ నార్కోటిక్స్ విభాగం జాయింట్ సెక్రటరీ పవన్ కార్తీక్,విసీఎస్సి అసోసియేట్ డైరెక్టర్ సీమా సిక్రీ, ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్ జె., అలాగే హెచ్‌పిసిఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సీఈఓ పి. విజయ్ కుమార్ సహకారం అందించారు. సురక్షితమైన, ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత విశాఖపట్నం నిర్మాణానికి నగర పోలీస్ మరియు విసీఎస్సి నిరంతరం కట్టుబడి ఉన్నాయని ప్రతినిధులు తెలిపారు.

## గిరిజన గ్రామాల్లో కలెక్టర్ సుడిగాలి పర్యటన



**అరకులోయ, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అనంతగిరి మండలానికి చెందిన పలు గిరిజన గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ గురువారం సుడిగాలి పర్యటన జరిపారు.అనంతగిరి మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించేందుకు కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగు విభాగం చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి వాటికి సంబంధించిన పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.పెద్దబిడ్డ పంచాయతీ,డముకు,నిమ్మల పాడు నుంచి పెద్దబిడ్డ వరకు నిర్మాణ దశలో ఉన్న తారు రోడ్డు పనులు,రోలింగ్ కు సిద్ధంగా ఉన్న పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. ఇదే మండలానికి చెందిన గుమ్మ నుంచి చీడివలస వరకు, నిమ్మవూట, మిర్తుతుంగడ, మద్దిపాడు, బూరుగులపాడు, కరకవలస, బూసిపాడు, పొర్లువలస మీదుగా నిర్మితమవుతున్న తారు రోడ్డు నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. ఝువతీ వరకు పూర్తి కాబడిన పనులను రోలింగ్ జరుగుతున్న పనులు పరిశీలించారు.వివిధ దశల్లో ఉన్న రోడ్ల పనుల లేయర్ల తీక్నెస్ ను రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు.ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తయితే రవాణా సదుపాయం మెరుగుపడుతుందని కలెక్టర్ గిరిజనులకు వివరించారు.ఈ రోడ్డు నిర్మాణంతో చుట్టుపక్కల గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు,నూతన సెల్ టవర్ నిర్మాణ పనులను ఉపయోగకరంగా ఉంటుందని గిరిజనులకు ఆయన వివరించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు రహదారి, కల్వర్టు దెబ్బతినకుండా అప్రోచ్ ల వద్ద సిసి ర్యాంప్, స్టోన్ ప్యాకింగ్ వంటి జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం అనంతగిరి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఓపి రిజిస్టర్,సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించి,అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెరుకు బిడ్డ గ్రామంలో ఎంపీపీ స్కూల్ ను పరిశీలించి పిల్లలతో ముచ్చటించి,పిల్లల విద్య బోధనపై ఆరా తీశారు. ఈ సుడిగాలి పర్యటనలో గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. వేణు గోపాల్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.అభిషేక్,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.గణేష్,మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జానికిరామపురం గ్రామంలో ఘనంగా తలుపులమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రారంభం



**గొలుగొండ, పిబ్రవరి 26, మేజర్‌న్యుస్:** గొలుగొండ మండలం జానికిరామపురం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ తలుపులమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణం భక్తి పరవశంతో మార్మోగింది. మహిళలు కోలాటం ఆడి భక్తి భావాన్ని వ్యక్తపరిచారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆలయ అభివృద్ధికి సహకరించాల్సిందిగా సంకల్పం చేశారు.

# శిథిలావస్థలో కోపరేటివ్ బిల్డింగ్

**- ఎప్పుడు పడిపోతుందో తెలియదు - భయభ్రాంతులకు గురవుతున్న స్థానికులు**



**ఆనందపురం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలంలో గల వేములవలస కో-ఆపరేటివ్ సొసైటీ పాత బిల్డింగ్ 1981వ సంవత్సరంలో నిర్మాణం చేపట్టారు అప్పటినుండి కొన్నేళ్లపాటు సేవలందించింది అనంతరం పూర్తిగా పాత భవనం కావడంతో ప్రక్కనే వేరొక నూతన బిల్డింగ్ నిర్మాణం ఏర్పాటు చేసి కో-ఆపరేటివ్ సొసైటీ విధులు సిబ్బందితో నిర్వహిస్తున్నారు. అయితే 1981 సంవత్సరంలో భవనం పాతది కావడంతో కొన్నిచోట్ల పడిపోయింది. ఈ మధ్యకాలంలో ఒక సైడు గోడ పూర్తిగా పడిపోవడంతో ఈ బిల్డింగ్ ఎప్పుడు పడిపోతుందో అని చుట్టుపక్కల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పాత భవనంలో చెత్తాచెదారం ఉండటంతో పాములు లు చేరుతున్నాయని, ఎప్పుడు ఎవరిపై పడుతుందో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు సొసైటీ యజమాన్యం చొరవ తీసుకొని శిథిలావస్థలో ఉన్న గోడలను తీసివేసి పూర్తి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నారా లోకేష్ నాయకత్వం రాష్ట్రానికి దిశానిర్దేశం

**- వీఎంఆర్ డిఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్**



**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో విద్యా, ఐటీ శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ కృషి అభినందనీయమని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు మెగా డిఎస్సీ ద్వారా సుమారు 16 వేల మంది ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ చేపట్టినందుకు మంత్రి నారా లోకేష్ నిరుద్యోగ యువత తరపున కృతజ్ఞతలు తెలిపారు. డీఎస్సీ ప్రకటనతో ఉత్తరాంధ్ర ప్రాంత నిరుద్యోగులకు కొత్త ఆశలు కలిగాయని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ద్వారా పారదర్శక నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనత మంత్రి నారా లోకేష్ దేనని స్పష్టం చేశారు. విద్యా రంగ సంస్కరణల్లో ఆయన నాయకత్వం రాష్ట్రానికి దిశానిర్దేశం చేస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా ఐటీ మరియు నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కొత్త అవకాశాలను సృష్టిస్తూ యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందని తెలిపారు. యువత ఆశయాలను నిజం చేసే నాయకుడు మంత్రి నారా లోకేష్ నని కొనియాడారు. అభివృద్ధి, ఉపాధి, పారదర్శక పాలన అనే విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. విశాఖ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# శాస్త్రీయ పరిశోధనల్లో పురోగతిపై ఏయూలో రెండు రోజుల జాతీయ సింపోజియం

**- శతాబ్ది ఉత్సవాలు, జాతీయ సైన్స్ వేడుకల్లో భాగంగా నిర్వహణ**




**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** శాస్త్రీయ పరిశోధనల్లో పురోగతిపై ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 27,28 తేదీలలో రెండు రోజుల జాతీయ సింపోజియంను నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ తెలిపారు. గురువారం ఉదయం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సదస్సులో పాల్గొనడానికి 9 మంది నిపుణులు వస్తున్నారని, వీరిలో 4 భట్నాగర్ అవార్డు గ్రహీతలు ఉన్నారన్నారు. మార్చి 5న రూ 10 కోట్ల వ్యయంతో ఏర్పాటైన అరబిందో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను ప్రారంభిస్తామన్నారు. ఏయూ ఆచార్యులుగా పనిచేసి విభిన్న విశ్వవిద్యాలయాలకు వీసీలుగా పనిచేసిన ఆచార్యులతో త్వరలో ప్రత్యేకంగా ఒక ప్రత్యేక ప్యానెల్ డిస్కషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అనుబంధ కళాశాల విద్యార్థులకు ఏయూ మౌళిక వసతులు, ప్రయోగశాలలు పరిచయం చేస్తూ సమ్మర్ ఇంటర్న్ షిప్పు అందించడానికి నిర్ణయించామన్నారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో అణ్వేషన్ అనే ప్రత్యేకమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. శతాబ్ది ఉత్సవాలను వారం రోజులు నిర్వహించే విధంగా ఒక ప్రణాళిక సిద్ధం చేసామని, త్వరలో వాటి వివరాలు సైతం తెలియజేస్తామన్నారు.ఏయూలో రెండు రోజుల జాతీయ సింపోజియం... ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి. ఆర్ రాజు మాట్లాడుతూ 27వ తేదీ ఉదయం 10 గంటలకు బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ కేంద్రంలో తొలిరోజు సదస్సును ప్రారంభిస్తామన్నారు. ఐఐటి మద్రాసు ఆచార్యులు ఎం. రామచంద్ర రావు, ఎస్.వి యూనివర్సిటీ వీసీ ఆచార్య తాతా నర్సింగ రావు, ఐఐఎస్సి ఆచార్యులు ఆచార్య కవిరాయని ప్రసాద్, ఆచార్య అపూర్వ ఖరే, ఐఐటి గౌహతి ఆచార్యులు రాఖి చతుర్వేది, ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్లు వివిధ అంశాలపై ప్రసంగాలు అందిస్తారు. అనంతరం లఘుచిత్ర ప్రదర్శన, స్కిట్ ప్రదర్శనతో తొలిరోజు కార్యక్రమాలు ముగిస్తారు. రెండవ రోజు ఏయూ పరిపాలనా భవనం నుంచి సుమారు 3 వేల మంది విద్యార్థులతో ర్యాలీ ప్రారంభించి, ఏయూ భౌతిక శాస్త్ర విభాగంలో సి.వి రామన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద ప్రత్యేక బెలూన్ను ఎగురవేస్తారు. కన్వెన్షన్ సెంటర్ వద్ద రెండవ రోజు కార్యక్రమాలలో భాగంగా ఐఐటి కాన్పూర్ పూర్వ ఆచార్యులు ఎస్.అనంతరామకృష్ణ, ఆచార్య అభిజిత్ ముఖర్జీ, ఐజర్ తిరుపతి ఆచార్యులు కె.శ్రీనివాస్, ఐఐటి మద్రాస్ ఆచార్యులు వీటూరి శ్రీనివాస్ల ప్రసంగాలు ఉంటాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు, బెస్ట్ రీసెర్చ్ పోస్టర్ ప్రజెంటేషన్ అవార్డులను ప్రధానం చేస్తామన్నారు.

## నేత్ర వ్యాధి పట్ల విద్యార్థులకు అవగాహన

**- ఎల్ వి ప్రసాద్ వైద్యులు అదితి పారిఖ్**



**ఆరిలోవ, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** నేత్ర వైద్యశాల నేత్ర సంరక్షణ పట్ల నిరంతర కృషి చేస్తూ నేత్ర సేవలకు అంకితమైన సంస్థ ఎల్ వి ప్రసాద్ ఆసుపత్రి విద్యార్థులకు ఇది పరీక్షల సమయం కావటం వలన ఈ సమయంలో కళ్ళ గురించి వారు తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించినది. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. ఈ సమయం వారు కళ్ళను జాగ్రత్తగా చూసుకోవలసి ఆవశ్యకత ఎంతో ఉంది. పూర్వం మాదిరి చదువులు పుస్తకాలకే పరిమితం కాక,పాఠశాలలో స్మార్ట్ బోర్డులు చూడటం, అర్ధరాత్రి వరకు చదవటం, మాక్ టెస్ట్‌లు వ్రాయటం, ఒక స్క్రీన్‌పై నోట్స్ మరియు మరొక స్క్రీన్‌పై వీడియోలు చూడటం జరుగుతున్నాది. ఈ ఆధునిక మార్పులు చదువును సులభతరం చేసినప్పటికీ, ఇది చాపక్రింద నీరులా నెమ్మదిగా కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ వంటి నేత్ర సమస్యలకు దారితీస్తున్నాది. ఈ సందర్భంగా ఎల్ వి పి ఈ ఐ, జీఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్ విశాఖపట్నం కన్సల్టెంట్ నేత్ర వైద్యుడు డాక్టర్ అదితి పారిఖ్ మాట్లాడుతూ సాధారణంగా విద్యార్థులు కంటి ఒత్తిడిని ఎక్కువ సమయం చదవటం వలన కలిగిన అలసట అని నిర్లక్ష్యం చేస్తుంటారు. కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ కంటి సమస్యకు కారణమై దృష్టిని, పనితీరును దెబ్బతీస్తుంది. కంటికి చిన్న పాటి విరామం ఇవ్వటం, క్రమం తప్పక కంటి పరీక్షలు చేయించటం ద్వారా దీనిని అధిగమించ వచ్చు పేర్కొన్నారు.

## గీతం విశ్వవిద్యాలయంలో ప్రకృతి వ్యవసాయ కొనుగోలుదారులు

**-విక్రేతల నెట్‌వర్కింగ్ సమావేశం**



**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం గీతం విశ్వవిద్యాలయం లో ప్రకృతి వ్యవసాయ కొనుగోలుదారులు-విక్రేతల నెట్‌వర్కింగ్ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26న విశాఖపట్నం గీతం విశ్వవిద్యాలయం లో ప్రకృతి వ్యవసాయ కొనుగోలుదారులు--విక్రేతల నెట్‌వర్కింగ్ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో రైతు సాధికార సంస్థా విజయ్‌కుమార్ (ఈవీసీ,ఆర్ వై ఎస్ ఎస్ ) జూమ్ ద్వారా పాల్గొని, రైతులు విలువ ఆధారిత సేవలను చేపట్టి రైతులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా మారాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వారి ఆదేశాల ప్రకారం వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలోని 13,300 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయశీ ప్రారంభించాలనే లక్ష్యాన్ని వెల్లడించారు. గీతం విశ్వవిద్యాలయం , ఆర్ వై ఎస్ ఎస్ తో కలిసి శాస్త్రీయ సాంకేతికత, పరిశోధనల ద్వారా ప్రకృతి వ్యవసాయ సహకరించనున్నట్లు తెలిపింది.కాకినాడకు చెందిన శ్రీలక్ష్మి నేచురల్స్ యజమాని నాగలక్ష్మి కుమారుడితో పాటు మరో నలుగురికి 30,000 /- ఉపాధి కల్పించిన విధానంపై వీసీ అభినందనలు తెలిపారు. అలాగే అవని ఆర్గానిక్స్ డైరెక్టర్ బిందు గారి కృషిని ప్రశంసించారు. ఆర్ వై ఎస్ ఎస్ సీనియర్ అధికారులు ప్రణయ్ భార్గవ్ విజయ్ నర్సింగ్, మాట్లాడుతు గ్రామస్థాయి రైతులు కొనుగోలుదారులు--విక్రేతల మధ్య ఉన్న మార్కెటింగ్ లోపాలను వివరించారు.

# విశాఖ ట్రాఫిక్ పై సీఎం సమీక్షించాలి

## : అసెంబ్లీలో గంటా



**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** ఆసియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ సీఆర్డీఏ మాదిరిగా ప్రతి వారం విశాఖ ట్రాఫిక్ పై సీఎం నారా చంద్రబాబు నాయుడు సమీక్ష జరపాలని సూచించారు. జూన్ 26 న భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభమైన తర్వాత ట్రాఫిక్ సమస్య మరింత జటిలం కానుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా మెట్రో, కోస్టల్ కారిడార్, ఫ్లయ్ ఓవర్లు ప్రతిపాదించినప్పటికీ, వాటి నిర్మాణాల్లో ఎలాంటి పురోగతి లేదన్నారు. విశాఖలో 30 ఏళ్ల క్రితం రోడ్లు విస్తరించగా, వాహనాల సంఖ్య 5 రెట్లు పెరిగిందని తెలియజేశారు. గూగుల్ డేటా సెంటర్ సహా ఐటీ.. టూరిజం.. ప్రాజెక్టులు ఏర్పాటు కానున్న నేపథ్యంలో రాబోయే 4-5 ఏళ్లలో లక్ష మంది ఉద్యోగులు విశాఖ వస్తారని, ఆ స్థాయిలో వాహనాలు పెరిగితే ట్రాఫిక్ పరిస్థితి చాలా దారుణంగా ఉంటుందని పేర్కొన్నారు.

# సెల్లార్ ఫ్లోర్లలో ఆక్రమణల తొలగింపులు




**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ లో పలు జోన్ల పరిధిలో ఆపరేషన్ లంగ్స్ 3.0 లో భాగంగా వాణిజ్య, వ్యాపార సముదాయాలలో, పలు అపార్ట్మెంట్లలో సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లలో వ్యాపారాలకు వినియోగిస్తున్న 11 ఆక్రమణలను 25, 26న తొలగించడం జరిగిందని, సెల్లార్ ఫ్లోర్లను ఆక్రమించిన వ్యాపారస్తులు స్వచ్ఛందంగా వెంటనే తొలగించుకోవాలని జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్ రావు గురువారం ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో ప్రజలు, వాహనదారులు రోడ్లపై, ఫుట్ పాత్ లపై, బహిరంగ ప్రదేశాలలో వారి వారి వాహనాలను పార్కింగ్ చేస్తున్నందువల్ల రోడ్లు ఇరుకునకు గురై ట్రాఫిక్ నకు అంతరాయం కలుగుతున్నందున ప్రజలు, వాహనదారుల ఇబ్బందులకు గురవుతున్నారని, వారి సౌకర్యార్థం వాణిజ్య సముదాయాలు, పలు అపార్ట్మెంట్లలో సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లను పూర్తిగా కేవలం వాహనాలు నిలుపుకొనే సౌకర్యార్థం ఏర్పాటు చేయాలనే దృఢ సంకల్పంతో ఇప్పటికే ప్రారంభమైన ఆపరేషన్ లంగ్స్ 3.0 లో భాగంగా మధురవాడ, నార్త్, ఈస్ట్, వెస్ట్, గాజువాక, అనకాపల్లి జోనులలో 11 సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌ల ఆక్రమణలను జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పోలీస్ వారి సహకారంతో తొలగించడం జరిగిందని ముఖ్య పట్టణ ప్రణాళికాధికారి తెలిపారు. ఆపరేషన్ లంగ్స్ 3.0 లో భాగంగా మధురవాడ 8వ వార్డులో మిథిలాపురి కాలని వద్ద ఒక ఆక్రమణ, నార్త్ జోనులో 14వ వార్డులో సీతమ్మధార వద్ద గోడౌన్, 43వ వార్డులో దొండపర్తి వద్ద ఒక ఆక్రమణ, వెస్ట్ జోనులో 90వ వార్డులో ఎన్.ఎ.డి. జంక్షన్ వద్ద ఒక ఆక్రమణ, ఈస్ట్ జోనులో 15వ వార్డులో ఇసుకతోట వద్ద కృష్ణ మందిర్ ఎదురుగా ఒక ఆక్రమణ, 13వ వార్డులో దారపాలెం వద్ద ఒక ఆక్రమణ, గాజువాక జోనులో 67వ వార్డులో గాజువాక మెయిన్ రోడ్ హెచ్ డి ఫ్ సి బ్యాంకు వద్ద స్టోరేజ్ మెటీరియల్ ను, సౌందర్య వద్ద స్టోరేజ్ మెటీరియల్ ను, అనకాపల్లి జోనులో 82 వ వార్డులో ఏ పి ఎన్ ఆర్ కాంప్లెక్స్, ఎమ్మార్వో ఆఫీసు రోడ్ వద్ద ఒక షాపును, పూడిమరక రోడ్డు వద్ద రెండు ఆక్రమణలు తొలగించడం జరిగిందని చీఫ్ సిటీ ప్లానర్ తెలిపారు. నగరంలో ఆపరేషన్ లంగ్స్ 3.0లో భాగంగా సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌ల ఆక్రమణలను తొలగించడం జరుగుచున్నందున, ఇప్పటికే పలు సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లలో పార్కింగ్ కోసం కాకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను వెంటనే స్వచందంగా ఆక్రమణదారులు తొలగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా జోనుల సహాయక ప్రణాళిక అధికారులు, ప్రణాళిక విభాగం సిబ్బంది, సచివాలయం సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా ఇంటిర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్(మెస్) కాంపిటీషన్ మార్చ్ 2 నుంచి 4 వరకు



**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 మేజర్‌న్యూస్:** ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా మార్చి 2-4 తేదీలలో ఏయూ వేదికగా ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ (మెన్) కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్. విజయ్ మోహన్ తెలిపారు. దేశ వ్యాప్తంగా 120 విశ్వవిద్యాలయాల నుంచి 500 బాడీబిల్డర్లు, 200 కోచ్లు, సాంకేతిక సిబ్బంది, న్యాయనిర్ణేతలు హాజరవుతారన్నారు. 8 విభాగాలలో 24 మందిని విజేతలుగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏయూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఏ యూ వైస్ ఛాన్సలర్ స్పోర్ట్స్ బ్రోచర్ ఆవిష్కరణ చేసారు. ఈ కార్యక్రమం లో రెక్టర్ ప్రొఫెసర్ పి. కింగ్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏం వి. ఆర్ రాజు. తదితరులు వున్నారు. విదేశీ విద్యార్థుల ఫెస్టివల్. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 55 దేశాలకు చెందిన 1100 మంది విదేశీ విద్యార్థులను శతాబ్ది ఉత్సవాలలో భాగస్వాములను చేస్తూ ప్రత్యేకంగా ఫుడ్ ఫెస్టివల్, కల్చరల్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య పాల్ డగ్లస్ తెలిపారు. విదేశీ విద్యార్థులు తమ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహార రుచులను, కళలను ఈ కార్యక్రమాలలో పరిచయం చేస్తారన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో రెక్టర్ ఆచార్య పి.కింగ్, ఆచార్య సంధ్య దీపిక, ఆచార్య శైలజ తదితరులు పాల్గొన్నారు.

# గృహోపకరణాల విక్రయం పేరుతో ఆన్‌లైన్ మోసం

## - నిందితుడు ను అరెస్ట్ చేసిన - సైబర్ క్రైమ్ పోలీసుల



**విశాఖ క్రైం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** ఆన్‌లైన్ వేదికల ద్వారా గృహోపకరణాల విక్రయం పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న నిందితుడిని విశాఖపట్నం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన నగర పరిధిలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు నేపథ్యంలో వెలుగులోకి వచ్చింది. గత ఏడాది డిసెంబర్ 25 తేదీన తేదీ సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి, ఒఎలెక్స్ వేదిక ద్వారా గృహోపకరణాల విక్రయం పేరుతో మోసపోయినట్లు ఫిర్యాదు చేశాడు. విక్రేతగా పరిచయమైన వ్యక్తి తక్కువ ధరలకు ఏసీలు, ఫ్రిజ్‌లు విక్రయిస్తానని నమ్మబలికి, బుకింగ్ మరియు రవాణా చార్జీల పేరుతో పలు విడతలుగా డబ్బులు వసూలు చేసినట్లు వెల్లడించాడు. అనంతరం నిందితుడు స్పందించడం మానుకుని, ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసి పరారయ్యాడు. ఇదే తరహాలో పలువురికి మోసం విచారణలో భాగంగా ఇదే విధానంలో మరికొందరు వ్యక్తులు కూడా మోసపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ ప్రకటనల ద్వారా తక్కువ ధరలకు వస్తువులు అందిస్తామని చెప్పి ముందస్తు చెల్లింపులు తీసుకుని మోసం చేసినట్లు తేలింది.సాంకేతిక ఆధారాలతో అరెస్ట్ ఈ కేసును పోలీస్ కమిషనర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో మొబైల్ నంబర్లను ట్రేస్ చేసి నిందితుడిని గుర్తించారు. అరెస్టు చేసిన నిందితుడు జలాది నాగరాజు (39), గుంటూరు జిల్లా చెబ్రోలు మండలం నరకోడూరు గ్రామ నివాసి అని పోలీసులు తెలిపారు. బెట్టింగ్ యాప్‌ల్లో డబ్బుల మళ్లింపు దర్యాప్తులో నిందితుడు తక్కువ ధరలకు వస్తువులు విక్రయిస్తానని చెప్పి కీప్యాడ్ ఫోన్లతో కస్టమర్లను సంప్రదించి డబ్బులు వసూలు చేసి, ఆపై నంబర్లను బ్లాక్ చేసి మోసం చేసినట్లు అంగీకరించాడు. మోసం ద్వారా సంపాదించిన డబ్బులను సెట్ స్పోర్ట్స్ అనే బెట్టింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టినట్లు వెల్లడించాడు. అనేక సిమ్ కార్డులు ఉపయోగిస్తూ పలు రాష్ట్రాల్లో హోటళ్లలో ఉంటూ గత 12 సంవత్సరాలుగా ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించి, నేరానికి ఉపయోగించిన మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. పోలీసుల హెచ్చరిక ఆన్‌లైన్ వేదికల ద్వారా వస్తువులు కొనుగోలు చేసే ముందు విక్రేత వివరాలను పూర్తిగా ధృవీకరించుకోవాలి. తక్కువ ధరల పేరుతో ముందస్తు చెల్లింపులు కోరితే అప్రమత్తంగా ఉండాలి. వస్తువును వ్యక్తిగతంగా పరిశీలించకుండా డబ్బులు చెల్లించకూడదు. క్యూఆర్ కోడ్‌లు, తెలియని యూపీఐ ఐడి లు లేదా అపరిచిత ఖాతాలకు డబ్బులు పంపడం నివారించాలి. బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటిపిలు, పిన్ లు, పాస్‌వర్డ్‌లు ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని పోలీసులు సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదుల కోసం జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1930కు సంప్రదించవచ్చని తెలిపారు.

# గ్లూకోవిటా 'ఎనర్జీ కా పవర్ బ్యాంక్' పేరుతో దేశంలో తొలి గ్లూకోజ్ లాలిపాప్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** విప్రో కన్స్యూమర్ కేర్ ఢ లైటింగ్ ప్రముఖ గ్లూకోజ్ బ్రాండ్ 'గ్లూకోవిటా' భారతదేశపు మొట్టమొదటి ఏకైక గ్లూకోజ్ లాలిపాప్‌ను రూ. 5 ధరకే విడుదల చేసింది. పిల్లలకు తక్షణ శక్తిని అందించేలా రూపొందించబడిన ఈ తియ్యని మిఠాయి 'గ్లూకోవిటా లాలిపాప్'. గ్లూకోజ్, విటమిన్ 'సి' లతో నిండిన ఇది, పాఠశాల, ఆటపాటలు, రోజూవారి పనులతో బిజీగా ఉండే పిల్లల శక్తిని తిరిగి నింపడానికి ఒక "ఎనర్జీ పవర్ బ్యాంక్ (శక్తిని నిలువ చేసే పరికరం)"లాగా పని చేస్తుంది. ఈ కొత్త ఉత్పాదనకు మద్దతుగా ఒక టెలివిజన్ ప్రచార చిత్రం కూడా విడుదల చేయబడింది. ఇందులో "రాబిన్" అనే చురుకైన తెలివిగల బాలుడు ఒక పుట్టినరోజు వేడుకలో ఎదురైన క్లిష్ట పరిస్థితిని తన తెలివితేటలతో మరియు ఈ లాలిపాప్ అందించిన శక్తితో ఎలా అధిగమించాడో చూపబడింది. నేటి తరం పిల్లల్లో ఉండే శక్తిని మరియు జిజ్ఞాసను ఈ ప్రకటన ప్రతిబింబిస్తూ, రుచి వినోదంతో కూడిన ఈ లాలిపాప్ వారి సాహసాలకు శక్తినిచ్చే వనరుగా ఎలా మారుతుందో వివరిస్తుంది. ఈ ప్రారంభోత్సవ వేడుక సందర్భంగా విప్రో కన్స్యూమర్ కేర్ ఢ లైటింగ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్-మార్కెటింగ్, ఎస్. ప్రసన్న రాయ్ మాట్లాడుతూ గ్లూకోవిటా ఎల్లప్పుడూ శక్తికి మారుపేరుగా నిలిచి ఉందని ఉద్ఘాటించారు. ఈ కొత్త గ్లూకోవిటా లాలిపాప్‌తో, ఆ నమ్మకమైన శక్తిని పిల్లలు ఇష్టపడే రూపంలో అందించాలని మేము నిర్ణయించామని తెలిపారు. ఒక చిన్న ఎనర్జీ బూస్ట్ (ఉత్తేజకర మిఠాయి) రోజువారీ క్షణాలను ఉత్సాహభరితంగా ఎలా నింపుతుందో మా టీవీ ప్రకటన చక్కగా చూపిస్తుందని, శక్తినివ్వడమే కాకుండా ఎంతో ఆనందాన్ని పంచే భారతదేశపు మొట్టమొదటి గ్లూకోజ్ లాలిపాప్‌ను పరిచయం చేస్తున్నందుకు మేము ఎంతో ఉత్సాహంగా ఉన్నామని అన్నారు." ఈ లాలిపాప్స్ ఆరెంజ్, స్ట్రాబెర్రీ మరియు వాటర్ మెలన్ రుచులలో (ఫ్లేవర్లలో) లభిస్తాయి. ఒక్కో లాలిపాప్ ధర కేవలం రూ. 5 మాత్రమే. రీటైల్ ప్యాక్‌లో 48 లాలిపాప్‌లు ఉంటాయి. ఇవి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని రిటైల్ స్టోర్లలో అందుబాటులో ఉంటాయి.

# డిజిటల్ అరెస్ట్ మోసంలో విదేశీ మూలాలు గుర్తింపు

**- మ్యూల్ ఖాతాలు సమకూర్చిన ఆరుగురు అరెస్ట్**

**- 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయస్థానం**













**పెద గంట్యాడ, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగిన భారీ సైబర్ మోసం కేసులో విదేశీ మూలాలను గుర్తించిన పోలీసులు, మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చి సహకరించిన ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఈ చర్యలు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ అధికారులమని నటిస్తూ విశాఖపట్నానికి చెందిన 67 ఏళ్ల విశ్రాంత ఆచార్యుడిని బెదిరించి, ఆయన ఆధార్ వివరాలతో నకిలీ బ్యాంకు ఏటీఎం కార్డు తయారైందని అబద్ధం చెప్పి, కేసు నుంచి తప్పించుకోవాలంటే భారీ మొత్తం చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. మానసిక ఒత్తిడికి లోనైన బాధితుడు విడతలవారీగా మొత్తం రూ.1 కోటి 5 లక్షలు బదిలీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. దర్యాప్తు సందర్భంగా బాధితుడి ఖాతా నుంచి రూ.6 లక్షలు ఒక ప్రభుత్వ రంగ బ్యాంకు ఖాతాకు జమ అయినట్లు గుర్తించారు. అనంతరం సాంకేతిక ఆధారాలు, క్షేత్రస్థాయి విచారణ ద్వారా మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలను సమకూర్చి, వాటి ద్వారా నగదు ఉపసంహరణలో సహకరించిన వ్యక్తులను పోలీసులు గుర్తించారు. అధిక కమిషన్ ఆశతో అమాయకుల వద్ద నుంచి బ్యాంకు ఖాతాలను తీసుకొని మోసగాళ్లకు అందించిన గువ్వల ధనుంజయరావు (32), గండిబోయిన దినేష్ (23), గండిబోయిన సూర్యకుమారి (43), రెల్లి కృష్ణ (43), అల్లి హేమసుందర్ రెడ్డి (57), ఇంటి కోటేశ్వరరావు (43)లను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, వారికి 14 రోజుల రిమాండ్ న్యాయ విధించింది. దర్యాప్తులో గువ్వల ధనుంజయరావు, గండిబోయిన దినేష్ గతంలో కంబోడియా, మయన్మార్ దేశాల్లో సైబర్ నేరాలకు పాల్పడినట్లు తెలిసింది. వీరి ద్వారా మరికొంతమంది నిందితులను కూడా పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తూ, అపరిచితుల బెదిరింపులకు లోనుకాకుండా, ఎలాంటి పరిస్థితుల్లోనూ బ్యాంకు వివరాలు, ధృవీకరణ సంకేతాలు ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు సమీప పోలీసు అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# భీమిలిలో కమిటీల నియామకాన్ని పరిశీలించిన సిరమ్మ



**భీమిలి, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు గురువారం భీమిలి నియోజకవర్గం, భీమిలి మండలం, ములకుద్దు గ్రామ సర్పంచ్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో జరుగు మండల వైఎస్సార్సీపీ పార్టీ గ్రామస్థాయి కమిటీల నియామకం ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు.వారి ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ హాజరై వైయస్సార్సీపి కమిటీల నియామకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిరమ్మ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు కీలకమని, ప్రతి కార్యకర్త తమ వివరాలను గ్రామ కమిటీలకు తెలియ చేయడం ద్వారా పార్టీ యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భీమిలి మండల పార్టీ అధ్యక్షులు గాడు శ్రీను , గ్రామ ఇంచార్జ్ టీ నగర్ సర్పంచ్ శేఖర్, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోటవాసు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

# ఛలో విజయవాడ జయప్రధం చేయండి

**- జర్నలిస్టుల సత్తా చాటండి**




**బుచ్చెయ్యపేట(అనకాపల్లి), ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు మార్చి 4వ తేదీన తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమంను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ఈశ్వరరావు అన్నారు. గురువారం బుచ్చెయ్యపేట ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ప్రెస్ క్లబ్ ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు విజయవాడలో జరుగు భారీ ర్యాలీ, బహిరంగ సభకు హాజరు కావాలని కోరారు. జిల్లా అధ్యక్షులు బి. వెంకటేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు సంబంధించి 11 ప్రధాన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ మహా ఉద్యమాన్ని తలపెట్టడం జరిగిందని, పెద్ద సంఖ్యలో పాల్గొని జర్నలిస్టుల సత్తా ప్రభుత్వానికి చాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు బాషా, మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాజా బాబు, తాతారావు, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పాత్రికేయులు పాల్గొన్నారు. అనంతరం చోడవరం ప్రెస్ క్లబ్ కు నూతన పాలక వర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**- చోడవరం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం...**

ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా శరగడం రాజు, ప్రధాన కార్యదర్శిగా సానబోయిన గోవింద, సహాయ కార్యదర్శిగా కొత్తూరు వాసు, ఉపాధ్యక్షులుగా సబ్బవరపు శ్రీనివాసరావు, కోశాధికారిగా కరణం దేవుళ్లు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# ఏ.ఎం.ఏ.ఎల్.కళాశాలలో ఖోఖో పోటీలు ప్రారంభం



**అనకాపల్లి, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం 100 సంవత్సరాల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సెంటినరీ ఉత్సవాలలో భాగంగా ఏయూ ఖో ఖో పురుషుల పోటీలు గురువారం

**- ఏ ఎం ఏ ఎల్ కళాశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి**

ఈ పోటీలలో సుమారు 7 జట్లు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు కాలేజీ కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు ( శ్రీను) పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకొని, పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో విన్నర్ గా ఏ.ఎం.ఏ.ఎల్ కళాశాల విద్యార్థులు గెలుపొందారు, కొత్తవలస ప్రగతి కాలేజీ క్రీడాకారులు రన్నర్ గా గెలుపొందారు. మూడో స్థానంలో ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులు పొందారు. గెలుపొందిన క్రీడాకారులను కళాశాల పాలకవర్గ సభ్యులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యక్షులు శ్రీధరాల కృష్ణ పేర్రాజు, ప్రిన్సిపాల్ జి. జయాబాబు, వైస్ ప్రిన్సిపాల్ టి. నిరంజన్ కుమార్, జి.బి. మెంబర్ వాసిరెడ్డి బాలకృష్ణ, సూపరింటెండెంట్ పి.అనురాధ, సెలక్షన్ కమిటీ సభ్యులు కే. చక్రవర్తి, డా. ఆర్. కిరణ్మయి, రెఫ్రీలుగా పి వీర్ నాయుడు, డి శ్యాంప్రసాద్, జి రాజు, ఫిజికల్ డైరెక్టర్ డా. కె వి.ఎస్. నాయుడు, స్టాఫ్ పాల్గొన్నారు.

## ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పట్టణ పోలీసులు



**నర్సీపట్నం, ఫిబ్రవరి 26, మేజర్‌న్యూస్:** చింతపల్లి మండలం, చేరుకుంపాకలు గ్రామానికి చెందిన 17 సంవత్సరాల వయస్సు గల బాలికకు, వారి తల్లిదండ్రులు చూసిన వివాహ సంబంధం తనకు ఇష్టం లేకపోవడంతో, ఆమెను పెదబొడ్డెపల్లి గ్రామంలోని వారి బంధువుల ఇంటికి తీసుకువెళ్లగా, అక్కడ నుండి తేదీ 22.02.2026 ఉదయం బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదని, ఆమె తల్లి గారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో తేదీ 24.02.2026 న మిస్సింగ్ కేసు నమోదు చేయబడినది. అని పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్కే గఫూర్ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు విషయమై, ఎస్.పీ , అనకాపల్లి జిల్లా వారి ఆదేశాల మేరకు, నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు , నర్సీపట్నం టౌన్ పోలీసులు పర్యవేక్షణలో, క్రైమ్ టీమ్ ద్వారా నర్సీపట్నం పట్టణంలోని అన్ని ముఖ్య ప్రదేశాలలోని సీసీటీవీ ఫుటేజీలను మరియు సాంకేతిక పద్ధతులను ఉపయోగించి దర్యాప్తు చేసి. దర్యాప్తు లో భాగంగా సీసీటీవీ ఫుటేజ్ విశ్లేషణ ఆధారంగా ఆ బాలికను ట్రేస్ చేసి, ఆమెను సురక్షితంగా ఆమె తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.కె గఫూర్ తెలిపారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించామని తెలిపారు.